

తీగ లాగితే.. డొంకంతా కదిలినట్లు సంగం ఇరిగేషన్ సెక్షన్‌లో పనులు చేయకనే పైసలు నొక్కేసే యత్నంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో ఇరిగేషన్ శాఖతోపాటు అధికార పార్టీ నేతల్లో కలకలం రేగింది. గతంలో కూడా ఇదే విధంగా దొంగ బిల్లులతో పలువురు ముఖ్యనేతలు జేబులు నింపుకున్నట్లు అదేపార్టీకి చెందిన నాయకులు గుసగుసపోతున్నారు. అయితే గతంలో ఐదారుగురు కీలక నేతల భాగస్వామ్యం ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా పంపకాలు జరిగిపోయాయని, ఈసారి వారందరినీ పక్కన పెట్టడం వల్లే గుట్టురట్టయ్యిందని అంటున్నారు.

పంపకాలు లేకనే బహిర్గతం!

దొంగ బిల్లుల్లో గతంలో కీలక నేతలకు వాటా

అప్పట్లో ఆ అధికారే సూత్ర, పాత్రధారి • రూ.2 కోట్లకుపైగా పంపకాలు

ఇప్పుడు ఒకరే బిల్లు చేసుకోవడంతో వెలుగులోకి..

సంగం, జనవరి 11 : 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక సంగం సెక్షన్‌కు కొత్తగా వచ్చిన అధికారి హయాం నుంచే దొంగ బిల్లులు వ్యవహారం నడిచిందనే ఆరోపణలు ఉన్నాయి. డెల్టాలో సాధారణంగా కాలువ పూడిక, ఇతర పనులకు రబీ సీజన్‌కు ముందు ఐఏబీ సమావేశంలో ప్రతిఏటా ఓఅండ్ఎం నిధులు మంజూరు చేస్తారు. 2019 నుంచి రూ.లక్ష దాటిన టెండర్ వర్కులను బినామీల పేరుతో స్థానిక నేతలే పనులు చేస్తున్నారు. మళ్లీ ఏడాది కూడా పనులు జరిగాయి. అయితే రెండు దఫాలు చేసిన పనులకు బిల్లులు సరిగా రాకపోవడంతో తరువాత ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీన్ని ఆసరా చేసుకున్న ఆ అధికారి అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరులో తనకు సుపరిచితుడైన ఓ కాంట్రాక్టర్ పేరుతో పనులు చేజిక్కించుకోవడం, అగ్రిమెంట్లు చేసుకోవడం, ఆ తరువాత బిల్లులు రావని కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు ప్రచారం చేయడం, అందరూ ఆదమరిచిన తరువాత పనులు చేయకుండానే స్థానిక నేతలతో కుమ్మక్కై వాటాలు పంచుకున్నట్లు ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఇందులో ఆ అధికారే సూత్రధారి, పాత్రధారిగా మారి అన్ని చక్కదిద్దేవాడని సమాచారం. ఈ క్రమంలోనే 2020, జూలైలో రెండవ పంట కోసం కావలి కాలువకు నీటి సరఫరాకు సంగం ఆనకట్టపై రూ.20 లక్షలతో ఇసుక బస్తాలు టెండర్లు దక్కించుకున్నారు. అయితే, పాత బస్తాల్లో కొన్నింటినే తొలగించి వాటిపై కొత్త బస్తాలు వేసి పూర్తిగా బిల్లు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



సంగం ఆనకట్ట ఫాలింగ్ షట్టర్ల వద్ద పాత ఇసుక బస్తాలపైనే కొత్త బస్తాలు వేస్తున్న కూలీలు (ఫైల్)

• వరదలో కొట్టుకుపోయాయని..

ఏటా రబీ సీజన్‌లో డిసెంబరు నెలాఖరు, జనవరి మొదటి వారంలో ఆనకట్టపై ఇసుక బస్తాలు వేస్తారు. కానీ, 2021లో ముందుగా నవంబరు 5వ తేదీనే రూ.32 లక్షలతో ఇసుక బస్తాల రింగ్ బండ్ మొదలు పెట్టారు. నాల్గవ వంతు మాత్రమే వేశారు. ఇంతలో నవంబరు 27వ తేదీన భారీ వరద రావడంతో వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయి. అయితే, పూర్తిగా వేసిన ఇసుక బస్తాలు వరదకు కొట్టుకు పోయినట్లు ఫ్లడ్ డ్యామేజ్‌లో చూపించి బిల్లులు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో జనవరిలో మళ్లీ టెండరు పిలవడంతో అదే వ్యక్తి కాంట్రాక్టర్ దక్కించుకుని ఇసుక బస్తాలు వేసి బిల్లులు పెట్టుకున్నారు. దీంతోపాటు ఆ 2021లో ఎఫ్‌డీఆర్ కింద మంజూరయిన కొన్ని పనులకు అదే కాంట్రాక్టర్ పేరుతో దొంగ బిల్లులు పెట్టి అందులో సగం మండలంలోని ఐదారుగురు కీలక నేతలకు వాటాలు పంచినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో రూ.2 కోట్లకు పైగా అవినీతి జరిగి ఉంటుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో అధికారి, కాంట్రాక్టర్, కీలక నేతలు సమానంగా పంచుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

• నేతల భాగస్వామ్యం లేకనే..

నాడు వాటాలు పంచుకున్న వారిలో ప్రస్తుతం దొంగ బిల్లులకు ప్రయత్నించిన నేతతోపాటు మరో నలుగురు నేతలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో ఇటీవల దొంగ బిల్లులతో పైసలు నొక్కేసే యత్నంలో ఆ కీలక నేతల భాగస్వామ్యం లేకపోవడంతో విషయం బహిర్గతం చేశారని అధికారి పార్టీకి నాయకులే చెబుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి బదిలీపై వెళ్లిన అధికారి హయాంలో 2020-21, 2021-22లో ఎఫ్‌డీఆర్, ఓఅండ్ఎం నిధులతో జరిగిన పనులపై విజిలెన్స్‌తో విచారణ చేయిస్తే అవినీతి బాగోతం బహిర్గతమవుతుందని అధికార పార్టీ నాయకులతోపాటు రైతులు కోరుతున్నారు.

అధిష్ఠానం తీరుపై అసంతృప్తి, ఆగ్రహం

• కందుకూరు వైసీపీలో గందరగోళం

• రిటన్ గిఫ్టు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కేడర్

కందుకూరు, జనవరి 11 : కందుకూరు నియోజకవర్గ వైసీపీలో గందరగోళం నెలకొంది. సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని కాదని కొత్తవారికి టిక్కెట్ ఇచ్చేదిశగా అధిష్ఠానం చేస్తున్న ప్రయత్నాలపై ఆ పార్టీ క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో బుధవారం జరిగిన కీలక పరిణామాలలో నలుగురు బీసీ యాదవ సామాజికవర్గ నేతల పేర్లతో ప్రజాభిప్రాయ సేకరణ చేయడం, ఆ తర్వాత కూడా అధిష్ఠానం అదే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు సంకేతాలు వస్తుండటంతో వైసీపీ క్యాడర్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. మహీధరరెడ్డికి టికెట్ ఇవ్వాలంటే ఆయన ముందుగా టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లను తీవ్రంగా విమర్శించాలని షరతు విధించారు. అకారణంగా ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేసే పనిలేదు.. ఆ తర్వాత టికెట్ మీ ఇష్టం... అని మహీధరరెడ్డి అధి ష్ఠానం దూతలతో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అంతేగాక ఎన్నికల వ్యయానికి కూడా పెద్దమొత్తంలో ముందుగా డిపాజిట్ చేయాలన్న నిబంధనకూడా మహీధరరెడ్డికి పెట్టగా అందుకు ఆయన తిరస్కరించినట్లు చెబుతున్నారు.



ఈ నేపథ్యంలో కనీసం మహీధరరెడ్డిని సంప్రదించకుండా ప్రత్యామ్నాయ అభ్యర్థుల కోసం పార్టీ వెదుకులాట ప్రారంభించటం తో పార్టీ క్యాడర్‌లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ అభ్యర్థిగా మహీధర రెడ్డి కాకుండా మరెవరైనా పోటీ నామమాత్రంగా మారుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అంతేగాక నియో జకవర్గంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీ కార్యకర్తలకు రమారమి రూ.100 కోట్లు వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదికాలంగా ఆ బిల్లులు విడుదల చేయాలని ఎమ్మెల్యే అధిష్ఠానం పెద్దలు, అధికారులపై ఒత్తిడి చేస్తున్నా ఏమీ ప్రయోజనం లేదని చెబుతున్నారు. మహీధరరెడ్డిపై అనుమానంతో ఎంతోకాలంగా నిఘా పెటారని ఆ మిషతో ఏడాది నుంచే కందుకూరుపై అధిష్ఠానం కుట్ర చేస్తున్నదన్న అభిప్రాయానికి వచ్చిన స్థానిక నేతలు అధిష్ఠానం తీరుపై మండిపడుతున్నారు. పార్టీ కోసం పదమూడేళ్లుగా కష్టపడి పనిచేసి అన్నివిధాలుగా నష్టపోయి అధికారంలోకి వచ్చేలా చేస్తే చివరికి కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో పెట్టి జగన్ మాకు గొప్ప బహుమతి ఇచ్చాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రెండు, మూడురోజుల్లో పరిస్థితులు మారవచ్చని ఇప్పటికీ ఆశాభావం వ్యక్తం చేస్తున్న కొందరు నేతలు మాత్రం అధిష్ఠానం తీరుమారకుంటే తామూ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతామని స్పష్టం చేస్తున్నారు.



ఛీ.. ర్యాంకు మిస్సైంది!

• స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో కానరాని నెల్లూరు • దేశవ్యాప్తంగా 130వ స్థానానికి పరిమితం

• రాష్ట్రంలో 6వ స్థానంతో ఊరట • కందుకూరుకు మెరుగైన ర్యాంకు

నెల్లూరు (సిటీ), జనవరి 11 : స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులు చేసిన కృషి, నిర్వహించిన కార్యక్రమాలు బూడిదలో పోసిన పన్నీరైంది. దేశంలో తొలి 100 నగరాల్లో నెల్లూరు సిటీ ఏమాత్రం శుభ్రంగా లేదని తేల్చిన కేంద్రం ర్యాంకుల వరుసలో 130వ స్థానానికి నెట్టేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన శుభ్రమైన నగరాల్లో నెల్లూరు జాడలేకుండా పోయింది. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ఏపీలో వైజాగ్ 4వ స్థానం, విజయవాడ 6, తిరుపతి 8, గుంటూరు 17వ స్థానాలు దక్కించుకుని ఉనికి నిలబెట్టుకున్నాయి. వీటికి సమీప దూరాన కూడా లేని నెల్లూరు 130వ స్థానంలో నిలిచింది. స్వచ్ఛ నెల్లూరు పేరిట అధికారులు ఊపిరితిప్పుకోకుండా నిర్వహించిన వరుస కార్యక్రమాలు ఫలితానివ్వలేదు. పైగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో మున్సిపల్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందన్న విమర్శలు మూట గట్టుకోవాల్సి వచ్చింది. అయితే రాష్ట్ర జాబితాలో 6వ స్థానంలో నిలబడటంతో కాస్త అధికారులకు ఊరటదక్కింది.

• కందుకూరుకు 3వ స్థానం

కందుకూరు : స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో రాష్ట్రస్థాయిలో కందుకూరు మున్సిపాలిటీకి 3వ స్థానం దక్కినట్లు కమిషనర్ ఎస్.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో 2020లో 5వ స్థానంలో నిలవగా గత సంవత్సరం 4, ప్రస్తుతం మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

కొందరికే 'తోడు'

• 8వ విడత విడుదల

• 18,858 మందికి రూ.19.95 కోట్ల రుణాలు



మెగా చెక్కు అందజేస్తున్న ఆనం అరుణమ్మ, అధికారులు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 11 : చిరువ్యాపారుల కోసం ఉద్దేశించిన జగనన్న తోడు పథకం ద్వారా 8వ విడతలో కొందరికే లబ్ధిచేకూరింది. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు ఆర్థిక సహాయ రుణాలను ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందచేస్తోంది. జిల్లాలో డీఆర్‌డీఏ-వైఎస్ఆర్‌కేపీ, మెప్మా ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుత 8వ విడతలో 18,858 మంది లబ్ధిదారులకు రూ.19.95కోట్లు రుణాల కింద అందచేశారు. అయితే అందరు చిరు వ్యాపారులకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరలేదన్న ఆరోపణలున్నాయి. కాగా, చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా జగనన్న తోడు పథకానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమచేయగా, నెల్లూరు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర పాల్గొన్నారు. లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

ప్రభుత్వం విధానం మారాలి

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నేత సుబ్రహ్మణ్యం

నెల్లూరు (వైద్యం): అంగన్‌వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వ విధానం మారాలని ఎస్‌డబ్లుఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం హితవు పలికారు. డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. జిల్లాలోని ఐసీడీఎస్ కేంద్రాల వద్ద ఆందోళనలు కొనసాగుతుండగా, నగరంలోని కలెక్టరేట్ వద్ద జరుగుతున్న దీక్షలో సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. మహిళలు అని కూడా చూడకుండా సీఎం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్లుఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాగేంద్రరావు, ఎస్‌కే మౌలాలి. ఏవిఎస్ రెడ్డి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాగేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు సుజాత, కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో ఇదేం తీరు!

• అధికారులపై భగ్గుమన్న క్రీడాకారులు • నిబంధనలు పాటించడంలేదని ఆగ్రహం

• చివరకు నేడు నిర్వహిస్తామని చెప్పడంతో విరమణ




సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో ఆందోళన చేస్తున్న క్రీడాకారులు

వరికుంటపాడు, జనవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'లో అధికారుల తీరుపై క్రీడాకారులు మండిపడ్డారు. వారంతా రాజకీయ కోణంలో వ్యవహరిస్తున్నారంటూ గురువారం సాయంత్రం వరికుంటపాడు ఎమ్పీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల జట్లకు బుధవారం కబడ్డీ ఫైనల్ నిర్వహించాల్సి ఉండగా చీకటి పడటంతో గురువారానికి వాయిదా వేశారు. ఉదయం వరికుంటపాడు జట్టు మైదానానికి చేరుకున్నా ప్రత్యర్థి జట్టు రాకపోవడంతో సాయంత్రానికి వాయిదా వేసి ఖోఖోను యథావిధిగా నిర్వహించారు. వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి జట్లు తలపడుతుండగా నిబంధనలు పాటించడంలేదని ప్రశ్నించినందుకు తమపై ఎంపీడీవో శ్రీదేవి పరుష పదజాలంతో మాట్లాడారని వరికుంటపాడు క్రీడాకారులు వాపోయారు. పోటీలో తిమ్మారెడ్డిపల్లి జట్టు విజయం సాధించడంతో వేదికపై ఉన్న అధికారులు వారికి మద్దతుగా కేకలు వేయడంతో వరికుంటపాడు క్రీడాకారుల్లో అసహనం పెరిగింది. తమను పరుష పదజాలంతో ఎందుకు దూషించారంటూ నిలదీశారు. దీంతో ఎమ్పీడీవో ఎదురుదాడికి దిగడంతో ఆమెకు మద్దతుగా నిలిచిన ఉద్యోగులు, క్రీడాకారులకు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. అనంతరం ఎమ్పీడీవో కార్యాలయానికి చేరుకున్నా పట్టువదలని క్రీడాకారులు అక్కడకూ చేరుకుని నినాదాలతో హోరెత్తించారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు మల్లికార్జున, ఎస్ఐ సుమన్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని క్రీడాకారులను సముదాయించినా వారు వినలేదు. ఎమ్పీడీవో క్షమాపణ చెప్పాల్సిందేనంటూ రాత్రయినా సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో కార్యాలయ ముఖ ద్వారం వద్ద బైఠాయించారు. చివరికి ఎంపీడీవోతో చర్చించిన అనంతరం తహసీల్దారు బయటకు వచ్చి శుక్రవారం ఇరుజట్లకు రామాపురం క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామని చెప్పి వెళ్లిపోయారు. పోలీసుల హెచ్చరికలతో క్రీడాకారులు కూడా శాంతించి వెళ్లిపోయారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన కబడ్డీ పోటీ శుక్రవారం ఎంతమేర జరుగుతుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

సంక్రాంతి పండుగను బంధు,మిత్రులతో జరుపుకునేందుకు నగర, పట్టణాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు పయనమవుతున్నారు. విద్యాసంస్థలతోపాటు శనివారం నుంచి నాలుగు రోజులు సెలవులు ఉండటంతో ఇంటిల్లిపాది పయనమవుతున్నారు. అయితే, తాళం వేసిన ఇళ్లను దోచేందుకు దొంగలు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటి యజమానులు జాగ్రత్తలు వహించాలంటూ పోలీస్ అధికారులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

ఊళ్లకు వెళుతున్నారా.. దొంగలతో జాగ్రత్త!





• ఎల్‌హెచ్ఎంఎస్‌తో ఇంటికి రక్ష

• పోలీసుల నిరంతర పర్యవేక్షణకు యాప్

నెల్లూరు (క్రైం), జనవరి 11 : సంక్రాంతి పండుగను బంధుమిత్రులతో జరుపుకునేందుకు నగర, పట్టణాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు పయనమవుతున్నారు. విద్యాసంస్థలతో పాటు శనివారం నుంచి నాలుగు రోజులు సెలవులు ఉండటంతో ఇంటిల్లిపాది పయనమవుతు న్నారు. అయితే, తాళం వేసిన ఇళ్లను దోచేందుకు దొంగలు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటి యజమానులు జాగ్రత్తలు వహించాలంటూ పోలీస్ అధికారులు కొన్ని సూచనలు చేస్తున్నారు.



ఎల్‌హెచ్ఎమ్ఎస్ యాప్

● ఇళ్లకు తాళాలు వేసుకొని సొంతూళ్లకు వెళ్లే ప్రజలు పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్) సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలకు అరికట్టవచ్చు.

● స్మార్ట్ ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లో ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకో వాలి. ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరచాలి. మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదు చేశాక యూనిక్ ఐడీ వస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎల్‌హెచ్ఎంఎస్‌లో నమోదు పూర్తవుతుంది.

• ఎల్‌హెచ్ఎంఎస్ వినియోగం..

ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే ప్రజలు ముందుగా ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళుతున్నారు, తిరిగి ఎప్పుడు వస్తారు అన్న వివరాలు యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోల్ట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

గస్తీ పెంచుతున్నాం

సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకునేందుకు సొంతూళ్లకు వెళుతున్న ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్‌హెచ్ఎంఎస్ సేవలను ఉపయోగించుకోవాలి. ఇళ్లకు తాళాలు వేసి వెళుతున్నప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచవద్దు. బ్యాంకు లాకర్‌లో జాగ్రత్త చేసుకోవడం మంచిది. పండుగలను దృష్టిలో ఉంచుకొని రాత్రి పూట గస్తీ పెంచుతున్నాము.

- డీ శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

హాజరు ఎంత!?



బయోమెట్రిక్ ద్వారా హాజరు వేస్తున్న ప్రభుత్వ వైద్యులు

• వైద్య విద్య కళాశాలలపై ఎన్ఎంసీ నిఘా

• బయోమెట్రిక్ అటెండెన్స్‌పై మార్గదర్శకాలు

• 75 శాతం వైద్యుల హాజరుపై తాజా ఆదేశాలు

• మెడికోలకూ బయోమెట్రిక్ తప్పనిసరి

నెల్లూరు (వైద్యం) జనవరి 11 : వైద్య కళాశాలలపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రత్యేక నిఘా పెడుతోంది. ఇప్పటివరకు వైద్యుల హాజరుపై పట్టీపట్టనట్టు ఉన్న ఎన్ఎంసీ ఇక నుంచి తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరును పర్యవేక్షించనుంది. ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. బయోమెట్రిక్ వేయకుంటే ఆ రోజు ఆ వైద్యుడు హాజరు కానట్టే లెక్క. తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాలి. లేకుంటే షోకాజ్ నోటీసులతోపాటు విధుల నుంచి తొలగించే అవకాశం కూడా ఉంది. వైద్యుల హాజరుపై రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అమలులోకి తెచ్చింది. బయోమెట్రిక్ ద్వారా చాలా మంది వైద్యులు సరిగ్గా అటెండెన్స్ వేయడం లేదన్న ఉద్దేశంతో ఈ విధానం తీసుకు వచ్చింది. అయితే, ఈ విధానాన్ని కూడా కొందరు వైద్యులు పాటించడంలేదని గతంలో జరిగిన సమీక్షలో డీఎంఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల నుంచే ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా అటెండెన్స్ తప్పనిసరి చేస్తూ ఎన్ఎంసీ జారీ చేసినట్లు తెలుస్తోంది.

• మెడికోలకూ అమలు

ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో చదివే మెడికోలకు కూడా ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టిమ్ ద్వారా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం వైద్య కళాశాలకు అనుమతులు వచ్చినా ఇంకా యాప్ ను విడుదల చేయలేదు. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదివే విద్యార్థులు హౌస్ సర్జన్ పూర్తయ్యేసరికి 875 మంది ఉండగా వీరంతా ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా హాజరు కావాల్సి ఉంటుంది. 75 శాతం హాజరు లేకపోతే పరీక్షలకు అనుమతించరు.

పెరుగుతున్న అటెండెన్స్

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలలో ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా వైద్యుల హాజరు పెరిగింది. ఇక్కడ 235 మంది వైద్యులు ఉండగా గురువారం 217 మంది హాజరుతో 92 శాతం మంది హాజరు అయ్యారు. అలాగే ప్రైవేట్ సంస్థ నారాయణ వైద్య కళాశాలలో 400 మందికి పైగా వైద్యులు ఉండగా అందరూ ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా హాజరు వేస్తున్నారు. ప్రతిరోజు ఎంత మంది హాజరు అవుతున్నారు. వారి వివరాలు, ఎంత శాతం హాజరు వంటి విషయాలను ఎన్ఎంసీకి పంపుతున్నారు.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. విరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

ఏపీ డీడీసీఎఫ్ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి

నెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా చిల్లకూరు సుధీర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తోటపల్లి గూడూరు మండలానికి చెందిన ఆయన ఆ పదవిలో ఆరు నెలలు కొనసాగనున్నారు. గతంలో సుధీర్‌రెడ్డి నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్‌గా పనిచేశారు.

రూ.60 అప్పు తీర్చలేదని దాడి



మున్సిపల్ కార్మికురాలిని పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

కావలి, జనవరి11: రెండవ డివి జన్‌లో పారిశుధ్య కార్మికు రాలిగా దినసరి వేతనంపై పనిచేస్తున్న దావులూరి రమా దేవిపై గురువారం కిరాణా దుకాణం యజమానులు దాడి చేసి గాయపరిచారు. సమ్మె విరమణ అనంతరం రమా దేవి పుల్లారెడ్డినగర్‌లో విధులు నిర్వహిస్తుండగా బాకీ చెల్లించలేదని వారు దాడి చేశారు. గాయపడిన ఆమె కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, సీపీఐ, మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ రూ.60 అప్పు తీర్చలేదని దాడి చేసి గాయపరచటం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేత కొప్పర్తి నాగరాజు, ఏఐటీయూసీ నేత రవి, మున్సిపల్ యూనియన్ నేతలు మల్లె అంకయ్య, ఆదినారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

కావలిరూరల్11: స్థానిక బాలకృష్ణారెడ్డినగర్ సచివాలయం దగ్గర పానీ పూరీ బండి పెట్టుకుని జీవిస్తున్న లాల్‌రామ్‌పై దాడి చేసిన బీకే నగర్‌కు చెందిన ఉయ్యాల సాయిని గురువారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ సుమన్ తెలిపారు. లాల్‌రామ్ దగ్గర ఉయ్యాల సాయి బుధవారం సాయంత్రం రూ.30లకు పానీపూరీ తిని, డబ్బు లు ఇవ్వకుండా, మళ్లీ రూ.10లకు పానీపూరీ పెట్టమని అడిగాడు. ముందుతిన్న దానికి డబ్బులు ఇవ్వమని అడగ్గా, కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు సాయిని గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య



అన్నవరపు ప్రకాష్(ఫైల్)

మర్రిపాడు, జనవరి 11: ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెంగంపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సుబ్బమ్మ, మాల్యాద్రిల కుమారుడు అన్నవరపు ప్రకాష్ (20) ఆత్మకూరులోని ఓ ప్రయివేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తల్లి పండగ సామాను తెచ్చుకునేందుకు ఉదయగిరికి వెళ్లింది. తల్లి బదులు ప్రకాష్ గురువారం గేదెలను మేపుకునేందుకు వెళ్లాడు. 12గంటల సమయంలో తల్లికి ఫోన్ చేసి బిర్యాణీ తీసుకురమ్మని చెప్పాడు. కాగా, తల్లి ఇంటికి వచ్చేసరికి ప్రకాష్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేళాడుతున్నాడు. దీంతో ఆమె చుట్టుపక్కలవారిని పిలిచి మృతదేహాన్ని కిందకు దించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి విచారిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5936
వెండి కిలో ధర	రూ. 73,500
వెండి ఒక గ్రాము	రూ. 75.50

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి : బీటీఏ

నెల్లూరు (విద్య), జనవరి 11 : వయసు 58 సంవత్సరాలు పైబడిన వారిని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని, బాలింతలను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని బీటీఏ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో లవన్నకు గురువారం వినతిపత్రం అందచేశారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని ఎన్నికల విధుల్లో నియమిస్తే చాలా అనారోగ్య, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, కార్యదర్శి రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాన్ని రద్దు చేయాల్సిందే!

- భూహక్కు చట్టంపై రోడ్డెక్కిన న్యాయవాదులు
- ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన

నెల్లూరు (లీగల్), జనవరి 11 : దుర్మార్గమైన నల్లచట్టాన్ని ప్రజలపై రుద్దాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ -2023కి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న ఆందోళనలో భాగంగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం ఉదయం కోర్టు విధులను బహిష్కరించి, జీఎన్‌టీ రోడ్డుపైకి చేరుకుని భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఉమా మహేశ్వర్ రెడ్డి, సుందరయ్య యాదవ్, ఉద్యమ కమిటీ కన్వీనర్ బ్రహ్మం మాట్లాడుతూ ఈ నల్ల చట్టం ప్రకారం అధికారులకు ప్రజల భూములు, ఆస్తులకు సంబంధించిన అంశాలు నమోదుచేసే హక్కు కల్పించి నట్లు తెలిపారు. రిజిస్టర్‌లో ఒకసారి భూ హక్కుదారుడి పేరు నమోదైన తర్వాత ఈ భూమిపై ఎవరూ కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు. ఎవరికైనా అభ్యంతరం ఉంటే జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసే జిల్లా ట్రిబ్యునల్‌లోనే తేల్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఒక వేళ ట్రిబ్యునల్‌లో న్యాయం జరగనప్పుడు రాష్ట్ర స్థాయి ట్రిబ్యునల్, ఆ తర్వాత హైకోర్టులో అప్పీ లు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ చట్టం వల్ల చిన్న, సన్నకారు రైతులు, దళితులు, బీసీ వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగు తుందని పేర్కొన్నారు. నిత్యం రాజకీయ నాయకుల కనుసన్నల్లో ఉండే రెవెన్యూ శాఖకు భూ హక్కులు అప్పగిస్తే నేతల చుట్టూ ప్రజలే తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడతా యన్నారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ప్రదర్శనగా వెళ్లి ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లో న్యాయవాదులు మానవహారం నిర్మించారు. దీంతో సుమారు గంటపాటు వాహన రాకపోకలకు తీవ్రం అంతరాయం ఏర్పడింది. ఆందోళనలో ఉద్యమ కమిటీ సభ్యులు వై.విజయ భాస్కర్ రెడ్డి, బద్దెపూడి రవీంద్ర, దుర్గా ప్రసాద్, చుక్కా రమేష్, టీడీపీ లీగల్ సెల్ నాయకులు షేక్ రియాజ్ బాషా, అన్వర్ బాషా, నన్నే సాహెబ్, పువ్వాడి శంకరయ్య, జనసేన లీగల్ సెల్ నాయకుడు రాజేష్, బార్ ఉపాధ్యక్షుడు ఎస్ఎం.సుభాని, నాగేళ్ల రేఖారాణి, చెన్నారెడ్డి వంశీధర్ రెడ్డి, రేవూరు శశికళ, పి. గీతావాణి, పెళ్లకూరు చంద్రికాదేవి, వీసీ కృష్ణ ప్రియాంకాదేవి పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న న్యాయవాదులు

జిల్లా కబడ్డీ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

- 16 నుంచి మినీ స్టేడియంలో శిక్షణ



కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

కావలి,జనవరి11: జూనియర్ బాల, బాలికల జిల్లా కబడ్డీ జట్టుకు 20 మంది బాలురను, 15 మంది బాలికలను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు గద్దె వెంకటేశ్వర్లు, చైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్, కార్యదర్శి వాయిల శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు 150 మంది హాజరు కాగా, పోటీల అనంతరం పైవారిని ఎంపిక చేశామన్నారు. వీరికి ఈ నెల 16 నుంచి కావలిలోని మినీ స్టేడియంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. శిక్షణ అనంతరం రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటాయన్నారు. క్రీడాకారులను ఎంపిక చేసిన వారిలో సీనియర్ క్రీడాకారులు గడ్డం శ్రీనివాసరావు, జీవీ మణి, ఎం. రవిబాబు, మణికంఠ తదితరులు ఉన్నారని వారు పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



రైల్వేస్టేషన్ ఎదురుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్న ఎంప్లాయిస్ సంఘ్ నేతలు

బిట్రగుంట, జనవరి 11: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ నూతన పెన్షన్ విధానం తీసేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బిట్రగుంట బ్రాంచ్ నేతలు డిమాండ్ చేశారు. బిట్రగుంట రైల్వేస్టేషన్ ఎదురుగా సంఘ్ అధ్యక్షుడు గోవిందరాజు, కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ్ నాయకుడు మర్రి రాఘవయ్య పిలుపు మేరకు దీక్ష చేస్తున్నామని తెలిపారు. ప్రతి రైల్వే కార్మికుడికి న్యాయం జరిగేలా చూడడమే ప్రధాన లక్ష్యంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ పనిచేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి సభ్యులు తులసీ, మస్తాన్, పవన్‌కుమార్, వరప్రసాద్, విజయభాస్కర్, తిరుపతి, బ్రహ్మయ్య, నాగరాజు, రాజకుమారి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- చివరి రోజు 23 మంది గైర్హాజరు

వెంకటాచలం, జనవరి 11 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ముగిశాయి. చివరి రోజైన గురువారం సెమిస్టర్ పరీక్షలలో 23 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలలో 8 మంది, అలాగే ఐదవ సెమిస్టర్ పరీ క్షలలో 15 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె విరమణ



ఏపీసీకి అంగీకార పత్రం అందచేస్తున్న జేఏసీ నేతలు

నెల్లూరు (విద్య), జనవరి 11 : సమగ్రశిక్ష విభాగంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్, కేజీబీవీల ఉద్యోగుల జేఏసీ గురువారం సమ్మెను విరమించింది. నాయకులు మాట్లాడుతూ సమగ్రశిక్షలోని అన్ని విభాగాలను పాఠశాల విద్యాశాఖలో విలీ నం చేయాలని, ఉద్యోగ భద్రత, హెచ్‌ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు, ఎక్స్‌గ్రేషియా పెరుగుదల, మరణించిన కుటుం బాలకు కారుణ్య నియామకాలు, కచ్చితమైన జాబ్ చార్ట్ తదితర 16 డిమాం డ్లతో 22 రోజులు చేపట్టిన సమ్మెను విరమిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం కొంత సానుకూలంగా ఉండడం, జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి విజ్ఞప్తి మేరకు సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏపీసీకి అంగీకారపత్రం అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంవో సుధీర్‌బాబు, జేఏసీ నేతలు పాల్గొన్నారు.

జన్‌భాగీదరి ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం): నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో జన్‌భాగీదరి కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దీనిని గురువారం కలెక్టర్ హరినారాయణన్ ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర, ఆయన సమాజా నికి చేసిన సేవలను నేటి యువత తెలుసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.



పుస్తకాలను తిలకిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, కమిషనర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కావలిటౌన్ : శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న జేవీవీ, యూటీఎఫ్ రాష్ట్ర నేతలు జానకీరామ్, శ్రీదేవి



ఆత్మకూరు : ర్యాలీలో పాల్గొన్న సీపీఎం, ప్రజాసంఘాల నేతలు

కావలిటౌన్, జనవరి 11: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జేవీవీ, యూటీఎఫ్ రాష్ట్ర నేతలు జానకీరామ్, శ్రీదేవిలు డిమాండ్ చేశారు. గురువారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 31రోజులు పూర్తిచేసుకుంది. సమ్మెలో జేవీవీ, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు పాల్గొని సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. సీఎం అంగన్‌వాడీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని తన నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నేతలు పీ పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టీ మాల్యాద్రి, యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలత, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కావలి: పలు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి వాటిని అమలు చేయాలని అంగన్‌వాడీలు పోరాటాలు చేస్తుంటే, వారిపై నిర్బంధాలు ఏమిటని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య అధ్యక్షతన ప్రతిపక్ష నేతలు సమావేశమై అంగన్‌వాడీల పోరాటానికి తమ సంపూర్ణమద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు మద్దతుగా ఈనెల 13న కావలిలో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బలిజేపల్లి వెంకటేశ్వర్లు(సీపీఐ) చింతాల వెంకట్రావు (కాంగ్రెస్) జ్యోతిబాబూరావు(టీడీపీ) కరువది భాస్కర్(సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ) పీ. సాయి విఠల్(జనసేన) పీ. మహేష్ (ఎఫ్‌బీఐ) సీఐ టీయూ నాయకులు టీ. మాల్యాద్రి, కృష్ణమోహన్, దర్గా బాబు, ఏఐటీయూసీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు తిరగబడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. బోగోలు అరుంధతీవాడలోని సచివాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనకు సీపీఎం, టీడీపీ, సీఐటీయూ, జైభీం అంబేడ్కర్ సేవా దళ్‌లు గురువారం మద్దతు పలికాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్ వాడీల న్యాయమైన కోరికలను తీర్చకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చల్లా నరహరి, లక్కాకుల మాధవరావు, బత్తుల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెకు మద్దతుగా గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం, ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ పాల్గొన్నారు.

అనంతసాగరం: సమస్యల పరిష్కారం కోసం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు గురువారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా అమలు చేసినా సమ్మె విరమించే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, జనవరి 11 : ఆడుదాం ఆంధ్రా రెండవ విడత మండల స్థాయి క్రీడా పోటీలు రెండవ రోజు కొనసాగాయి. గురువారం బాల్‌బ్యాడ్మింటన్‌లో నెల్లూరుపాళెం సచివాలయం నుంచి సీహెచ్ కార్తీక్, ఏ అశోక్ విన్నర్లుగా నిలిచారు. ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే నియోజకవర్గ స్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ ప్రకటించారు. అదేక్రమంలో క్రికెట్ సెమీఫైనల్ మ్యాచ్‌లు ముగిశాయి. శుక్రవారం ఎస్‌ఆర్ జెడీ క్రీడా ప్రాంగణంలో క్రికెట్ ఫైనల్స్‌తో పాటు మహిళల బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు తెలిపారు.

విధుల్లో చేరిన ఉద్యోగులు



ఎంఈవోకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి రూరల్, జనవరి 11: మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం విధుల్లో చేరుతున్నట్లు ఎంఈవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ బుధవారం ప్రభుత్వంతో ఉద్యోగ సంఘ నాయకులు జరిపిన చర్చల్లో సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు.

గిరిజనులకు చీరలు, దుప్పట్ల పంపిణీ



గిరిజనులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి

సంగం, జనవరి 11: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో కాలువ గట్టుపై నివసిస్తున్న 17 గిరిజన కుటుంబాలకు గురువారం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య మెమోరియల్ తరపున గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు సహకారంతో అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కాకర్ల సురేష్

వింజమూరు, జనవరి 11 : వింజమూరు మండలం జనార్ధనపురం గ్రామంలో జేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముందుగా బత్తినవారిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ఆటల పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాకలికొండ, జనార్ధనపురం గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు నేతలు, న్యాయవాదులు

ఆత్మకూరు, జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులకు భంగం వాటిల్లే విధంగా తయారుచేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్-22 చట్టాన్ని రద్దు చేయాలని పట్టణంలోని న్యాయవాదుల సంఘం, ఆల్ ఇండియా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక సెషన్స్ కోర్టు వద్ద నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఈచట్టం వలన జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ప్రజా వ్యతిరేకమైన ఈ నల్ల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కెవి శేషారెడ్డి, ఎల్వీ రమణయ్య, షేక్ నజీర్‌బాష, సిరాజ్, మధుసూదన్, రమేష్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, లక్కు కృష్ణప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి లక్ష్మీపతి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్

ఉదయగిరి రూరల్, జనవరి 11: మండలంలోని గుడినరవ గ్రామ ఎస్సీ కాలనీ క్రీడా మైదానంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేల నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు రూ.550 ఎంట్రీ ఫీజు చెల్లించి 7904828190 నెంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సబ్ ట్రెజరీ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న గంగాద్రి

ఉదయగిరి రూరల్, జనవరి 11: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో గురువారం జిల్లా ఖజానాధికారి గంగాద్రి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయంలో రికార్డుల తనిఖీ చేపడుతున్నామన్నారు. తనిఖీల్లో లోపాలను గుర్తించి సిబ్బందికి సూచనలు ఇస్తామన్నారు. అదనంగా నిధుల చెల్లింపులు జరిగి ఉంటే రికవరీ విధిస్తామన్నారు. జిల్లాలో కావలి, వింజమూరు, ఉదయగిరి, ఆత్మకూరు మండలాల్లో నూతన సబ్ ట్రెజరీ భవనాలు పూర్తయ్యాయన్నారు. కోవూరు కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. బుచ్చిలో స్థలం సమస్య ఉండగా, పొదలకూరు భవన నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. నెల్లూరు ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీవో మమత, సీనియర్ అకౌంటెంట్లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్‌కుమార్, తనిఖీ అధికారులు మోషే, మధుబాబు, నరేంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు స్టార్టర్ల చోరీలను అరికట్టాలి

వింజమూరు, జనవరి 11 : పట్టణంలోని ఎర్రబల్లిపాలెం పొలాల్లో మోటార్లకు అమర్చిన స్టార్టర్‌ల వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి తీసుకుపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి పొలాల్లోని మోటార్ల వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారని, దీనివల్ల నష్టం జరుగుతోందన్నారు. ముఖ్యంగా మంచు కురుస్తూ చలి తీవ్రత వలన పొలాల్లోకి రైతులు వెళ్లలేకపోవడంతో ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

కంకర క్వారీలపై చర్యలు చేపట్టాలి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 11: తమ గ్రామంలో ఏర్పాటుచేసిన కంకర క్వారీలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే వాటిపై తగిన చర్యలు చేపట్టాలని మండలంలోని బండకిందపల్లి గ్రామస్థులు ప్రజాప్రతినిధులు, అధికారుల ఎదుట వాపోయారు. గురువారం గ్రామంలో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో రేయింబవళ్లు క్రషర్లు పనిచేస్తుండడంతో వాటి పరిసరాల్లో సాగు చేస్తున్న పంటలు దుమ్ము, ధూళితో పూర్తిగా దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నామన్నామన్నారు. దీంతో అక్రమ క్వారీలపై చర్యలు చేపట్టాలని రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించడంతో పరిశీలించి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు ఎల్‌పీ మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో సాయిప్రసాద్, ఉదయగిరి రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి రూరల్, జనవరి 11: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించే వైసీపీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ జీ ఓబులరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారన్నారన్నారు. అలాగే శకునాలపల్లి పంచాయతీ కుర్రపల్లి గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమృత్‌ధార వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, ఉప సర్పంచ్ ముర్తుజా, మాజీ వైస్ ఎంపీపీ బీ శ్రీనివాసులు, నాయకులు ఎస్థానీ, ఉప్పుటూరి శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు



అల్లూరులో రక్తదానం చేస్తున్న యువకులు

అల్లూరు, జనవరి 11 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర జన్మదిన వేడుకలను గురువారం అల్లూరులో నిర్వహించారు. తెలుగు యువత ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీద గిరిధర్, పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి కృష్ణచైతన్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, రఫీమాలిక్, నీలపరెడ్డి హరీష్, హారూన్ రషీద్, అరగల రమణయ్య, తోట శ్రీహరి పాల్గొన్నారు.

కావలి : బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు గురువారం కావలిలో పోటాపోటీగా నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఉదయం పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. టీడీపీలోని మరో వర్గం ఆధ్వర్యంలో సాయంత్రం ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో జన్మదిన వేడుకలను జరిపారు.

బిట్రగుంట : బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో గురువారం బీద రవిచంద్ర పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, గద్దే కొండయ్య, శ్రీనివాసులు, మనోహర్, పీ.హర్ష, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు చింతనబోయిన శివకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

టీడీపీలో 16 కుటుంబాల చేరిక



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఇంటూరి

గుడ్లూరు, జనవరి 11: మండలంలోని మెండివారిపాలెంలో వైసీపీకి చెందిన 16 కుటుంబాల వారు గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీలో చేరుతున్న వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. టీడీపీలో చేరిన వారిలో ప్రళయకావేరి పోలయ్య, వాయిల భాస్కర్, వాయిల బాబు, వాయిల కుమార్, ప్రళయకావేరి గోవిందు, ప్రళయకావేరి ఏడుకొండలు, వాయిల సూరి, వాయిల రమణయ్య, వాయిల రాము, కాటంగారి నరసయ్య, కాటంగారి రామకృష్ణ, వాయిల బుజ్జెయ్య, పి. పోలయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జే. నాగరాజు, జీ. హరిప్రసాద్, పీ కృష్ణ, బొజ్జా సుబ్బారావు, అట్ల కోటయ్య, బీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని 27,28 వార్డుల పరిధి పడమర యాదవపాలెం, రజకపాలెంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పార్టీ మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహనరెడ్డి సైకోచేష్టలు, చేతకాని పరిపాలనతో రాష్ట్రంలో దోపిడీలు, దందాలు అధికమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, బక్కమంతుల మనోజ్, హరీష్, మహిత తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే కుష్ఠు నివారణ

కావలి,జనవరి11: ప్రాథమిక స్థాయిలో కుష్ఠును గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే ఏడాదిలోనే వ్యాధి తగ్గిపోతుందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. కావలి ఏరియా వైద్యశాలలోని ఏఆర్‌సీ సెంటర్, టీబీ ల్యాబ్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం కావలి ఏరియా వైద్యశాలతోపాటు కోవూరుపల్లి పీహెచ్‌సీ, కొండబిట్రగుంట, ముసునూరులలో కుష్ఠు వ్యాధి కేసులను చూశామన్నారు. 3 కేసులను గుర్తించామని, 10 సస్పెక్టడ్ కేసులను పరీక్షించి లెప్రసీ కాదని నిర్ధారించామన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మను దర్శించుకున్న వంటేరు దంపతులు

జలదంకి, జనవరి11: మండలంలోని బ్రాహ్మణక్రాకలో గల నడివీధి పోలేరమ్మ జాతర గురువారం ముగిసింది. ముగింపురోజు అమ్మవారిని గ్రామస్థులు దర్శించుకుని కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. స్వగ్రామంలో జరుగుతున్న జాతరకు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి-ఇందిరమ్మ దంపతులు హాజరు కావడంతో ఆచారి కాపులు దేవరపల్లి వెంకటరమణారెడ్డి, వేలమూరి శ్రీనివాసులురెడ్డిలు ఘనంగా సన్మానించారు. అనంతరం వంటేరు దంపతులను సర్పంచి ఇండ్ల సుధాకర్ దంపతులు కూడా సన్మానించారు. జాతర ముగింపు సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

లాల్‌బహుదూర్ శాస్త్రికి నివాళులు

కావలి,జనవరి11: దేశ రెండవ ప్రధాని లాల్‌బహుదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా గురువారం వెంగళరావునగర్‌లోని లోకల్ లైబ్రరీ ఆవరణలో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నీతినిజాయితీకి మారు పేరు శాస్త్రి అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, గ్రంథాలయాధికారి సునీత, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం

కావలి,జనవరి11: కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో జడ్జిగా పనిచేస్తున్న ఆర్. వరలక్ష్మి పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు, ఇతర న్యాయవాదులు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాఘవయ్య, జోసఫ్, కోహిలీ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ టాపర్‌గా వెంకట సాయిశృతి



కావలిటౌన్, జనవరి11: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని అడ పాల వెంకట సాయిశృతి జేఎన్‌టీయూ టాపర్‌గా నిలిచింది. అనంతపురంలో జరిగిన స్నాత కోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, జేఎన్‌టీయూ వీసీ రంగజనార్ధన్ చేతుల మీదుగా ఆమె బంగారు పతకం, గ్రాడ్యుయేషన్ పట్టా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను గురు వారం విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ప్రిన్సి పాళ్లు దత్తాత్రేయశర్మ, సురేష్‌లు తదితరులు అభినందించారు.

సంక్రాంతి కానుక అందజేత

బిట్రగుంట : ముంగమూరు వద్ద ఉన్న ఆదరణ కేంద్రానికి కాంగ్రె యువనేస్తం అధినేత సతీష్‌నాయుడు సంక్రాంతి కానుకగా రూ 15వేల విలు వయిన నిత్యావసర వస్తువులను గురువారం అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు కే భవానీ మాట్లాడుతు పేదల ఆకలి తీర్చేందుకు సతీష్‌నాయుడు సొంత నిధులు అందచేస్తునందుకు కృతజ్ఞతలు తెలిపారు. గంగినాయుడు దాతృత్వంతో బోరు వేయించడం వల్ల నీ టి కొరత తీరిందన్నారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్ర డైరెక్టర్ సింహాద్రిరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బీసీఈఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కావలిటౌన్, జనవరి11: బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వారి క్యాలెండర్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్ కిరణ్ తదితరులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ మాధవరెడ్డి, తదితర అధికారులను కలిసి క్యాలెండర్‌లు బహూకరించారు. కార్యక్రమంలో బీసీఈఎఫ్ నేతలు అన్నం శ్రీనివాసులు, తుమ్మ రవి, వాసిలి సురేష్, పీ మాధవ, వీ మాధవ, చెన్ను కృష్ణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ కమిటీల ఎంపిక

కావలిటౌన్, జనవరి11: ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏసురత్నం మాదిగ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ కమిటీల ఎంపిక జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సూరిపాక ఉదయ్‌కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి చేవూరు కిరణ్, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు జయంత్ పాల్గొని ఎంపికలను పర్యవేక్షించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా డీ వినోద్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్, అధికార ప్రతినిధిగా అశోక్, ఉపాధ్యక్షులుగా శెట్టిపల్లి శామ్యేలు, హజరత్, శివయ్య ఎంపికయ్యారు. పట్టణ అధ్యక్షుడిగా మందా మహేష్, ప్రధాన కార్యదర్శిగా మందా రసూల్, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా కత్తి బుజ్జిబాబు, కార్యదర్శిగా శివకోటయ్య, పట్టణ అధ్యక్షుడిగా వరప్రసాద్, కార్యదర్శిగా మాధవ ఎంపికయ్యారు.

ఏప్రిల్ వరకు సాగునీరివ్వాలి

దగదర్తి(బిట్రగుంట), జనవరి 11: తలమంచి మేజర్ కెనాల్‌పై ఆధారపడ్డ రైతులకు ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలని తాళ్ళూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు డిమాండ్ చేశారు. దగదర్తి మండల ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఇరిగేషన్ అధికారులు, రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి వరకే సాగునీరు అందిస్తే, ఆలస్యంగా పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోతారని ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులురెడ్డికి వివరించారు. రైతుల పంటలు నష్టపోకుండా ఉండాలంటే ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో రైతులు, సర్పంచులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎల్లంచర్ల శీనయ్య, ఇండ్ల రాజు, బాలవేణు, కాంద్రె శ్రీనివాసులు, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం సీసాల పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి

గుడ్లూరు, జనవరి 11: అనుమతులు లేకుండా మద్యం అమ్ముతుండగా ఓ వ్యక్తిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు.ఈ సంఘటన మండలంలోని సాలిపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, సాలిపేటకు చెందిన ఆకురాటి అశోక్‌కుమార్ చుట్టుపక్కల మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలుచేసి, వాటిని సాలిపేటలోని తన దుకాణంలో నిల్వఉంచి.అధిక ధరలకు విక్రయించేవాడని స్థానికులు కొందరు పోలీసులు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు దాడిచేసి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కందుకూరు కోర్టులో హాజరు పరచామని ఆయన తెలిపారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, జనవరి 11: మినుము, మిర్చి పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని కందుకూరు కేవీకే శాస్త్రవేత్త జీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, నూకవరం గ్రామాల్లో సాగులో ఉన్న మిర్చి, మినుము పంటలను గురువారం ఆయన వ్యవసాయ, ఉద్యానవనశాఖాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చిలో పోషకాల లోపాల వలన ఆకు ముడత తెగులు ఆశించినట్లు తెలిపారు. నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో హేమంత్‌భరత్‌కుమార్, హెచ్‌వో బ్రహ్మసాయి, ఉద్యానవనశాఖ సహాయకులు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఈవోపై ఎమ్మెల్సీ ఫిర్యాదు

వలేటివారిపాలెం, జనవరి 11: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఈవో కేబీ శ్రీనివాసరావుపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ప్రాంగణంలో గత నెల 23న పోటు భవనం, టాయ్‌లెట్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రొటోకాల్ పాటించకుండా, ఒకరిద్దరికీ మాత్రమే ఆహ్వానం పలికారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో మాధవరావు గత నెల 24న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కందుకూరు సబ్‌కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈవో సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరై సంజాయిషీ చెప్పినట్లు తెలిసింది.

లింగసముద్రంలో జోరుగా పేకాట

లింగసముద్రం, జనవరి 11: మండలంలోని పలు గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతోంది.ప్రతిరోజూ పేకాటలో రూ. లక్షలు చేతులు మారుతున్నాయి. లింగసముద్రం, తాతాహోటల్, మొగిలిచెర్ల, పెదపవని, వీఆర్ కోట తదితర గ్రామాల్లో పేకాట ముమ్మరంగా జరుగుతోంది. ఇక్కడ రోజుకు రూ.2 వేలు తీసుకొని పేకాట ఆడిస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. పేకాట ఆడే సమయంలో పోలీసుల సమాచారం తెలిపేందుకు, అవసరమైన వస్తువులు తెచ్చి ఇచ్చేందుకు కొందరు సహాయకులను నియమించుకున్నారు. వారికి రోజుకు కొంత నగదు ముట్ట చెబుతున్నట్టు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

కొండాపురం, జనవరి11: కాకర్ల ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు నియోజకవర్గ స్థాయిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర్ల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈనెల 14, 15 తేదీల్లో ఇంటిముందు వేసుకున్న ముగ్గును సెల్ఫీ తీసుకొని ఫొటో, పేరు, ఊరు, మండలం, సెల్ నెంబరు తదితర వివరాలతో 15వతేదీ సాయంత్రం 6 గంటలలోగా మా వాట్సాప్ నెంబరు 94089 90899 నెంబరుకు పంపాలన్నారు. మండలానికి 10 మంది చొప్పున ఈనెల 18న వింజమూరు తమ ట్రస్టు కార్యాలయం వద్ద ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. మొదటి విజేతకు రూ 25,116, రెండవ విజేతకు 15,116, మూడవ విజేతకు రూ 10, 116, మరో పదిమందికి రూ 3,116 విలువగల ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా ఆడుదాం ఆంధ్రా..

కొండాపురం, జనవరి11: మండలంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. మండలంలో గురువారం జరిగిన క్రికెట్ పోటీలకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు కనీస వసతులు కరువయ్యాయి. ఎంపైర్లకు తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు కూడా ఏర్పాటుచేయలేదు. నీడ కోసం టెంట్లు వేయకపోగా ఎండలో కూర్చునేందుకు ఇష్టం లేక ప్రేక్షకులు ఆటలను చూసేందుకు రావడంలేదు. ఉదయం తీసుకువచ్చిన వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజనవసతి కూడా ఏర్పాటు చేయలేదు.

'ఎమ్మెల్సీ పదవి ఇచ్చే పార్టీలకే ఓటు'

జలదంకి, జనవరి11: వచ్చే ఎన్నికల్లో యానాదులకు ఎమ్మెల్సీ పదవి, యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీకే ఓట్లేస్తామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య పేర్కొన్నారు. యానాదులతో ముఖాముఖిలో భాగంగా గురువారం జలదంకి మండలం నెహ్రూనగర్, అప్పారావుతోట గిరిజన కాలనీల్లో పర్యటించారు. ఆయన అక్కడి మహిళలతో ముఖాముఖి మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మన సమస్యలు తీరాలంటే చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బృంద సభ్యులు మానికల మురళీ, మాకాని రవీంద్రబాబు, చెంబేటి లక్ష్మీ, కల్లూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థి గెలుపు ఖాయం

● పాదయాత్రకు 'దేశం' నేతల మద్దతు



జనసైనికులతో కలిసి బొబ్బేపల్లి చేపట్టిన పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

వెంకటాచలం, జనవరి 11: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గొలగమూడి వెంకయ్యస్వామి ఆశీస్సులతో సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థి గెలుపు ఖాయమని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు జోస్యం చెప్పారు. సర్వేపల్లి జనసేన ఆధ్వర్యంలో సురేష్ నాయుడు చేపట్టిన పాదయాత్రను గురువారం నిడిగుంటపాళెం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఇస్కపాళెం, సర్వేపల్లి, తిక్కవరప్పాడు గ్రామాల మీదుగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమానికి చేరుకున్నారు. పాదయాత్రకు తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, టీడీపీ మండల నాయకులు రావూరి పద్మనాభనాయుడు, నిడిగుంటపాళెం టీడీపీ నేతలు మద్దతు తెలిపి బొబ్బేపల్లిని శాలువాలతో సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేనల ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావాలని, సర్వేపల్లి నుండి టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థి అఖండ మెజార్టీతో గెలుపొందాలని వెంకయ్యస్వామిని కోరుకున్నట్లు బొబ్బేపల్లి తెలిపారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణి భవాని, పినిశెట్టి మల్లికార్జున్, శ్రీహరి, షేక్ రహీమ్, అశోక్, ఖాజా, సుమన్ తదితరులున్నారు.

అవినీతి, అక్రమాలకు
కేరాఫ్ కాకాణి

● మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, జనవరి 11 : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అవినీతి, అక్రమాల చిట్టా ఎంత చెప్పినా తక్కువేనని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. మండలంలోని తాటిపర్తిపాళెం గ్రామంలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ, జయహో బీసీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించి టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తనకు ఉన్న కోట్ల రుపాయల ఆస్తులు అమ్ముకొని రాజకీయాలు చేశానని, కాకాణి లాగా అందిన కాడికి అందినట్లుగా దోచుకోలేదన్నారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, కుంకాల నాగేంద్రప్రసాద్, బొమ్మి సురేంద్ర, రాధాకృష్ణమ నాయుడు, నాగార్జున్‌రెడ్డి, రమేష్‌నాయుడు, తదితరులున్నారు.

వైద్య పరికరాల బహూకరణ



వైద్యాధికారి పద్మజకు దాతల తరపున వైద్య పరికరాలు అందజేస్తున్న దొడ్ల కోదండరామిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి11: స్థానిక సీహెచ్‌సీకి మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి, కోదండరామిరెడ్డి కుటుంబం తరపున దాతలు పొన్నలూరు సునీతమ్మ, వినీతమ్మల సహకారంతో గురువారం వైద్య పరికరాలను బహూకరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజకు కోదండరామిరెడ్డి వీటిని అందజేశారు. రోగులకు అవసరమైన రూ.2లక్షలకుపైగా విలువచేసే సీటీజీ పరికరం కూడా బహూకరించేందుకు దొడ్ల కుటుంబసభ్యులు ముందుకు రావడం అభినందనీయని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అబ్దుల్ సమీద్, ప్రత్యూష, అశ్విని తదిత రులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీల్లో బోర్ల ఏర్పాటు

వెంకటాచలం : చవటపాళెం, కనుపూరు, పాలిచెర్లపాడు గ్రామాల్లోని గిరిజన కాలనీలలో గురువారం నెల్లూరుకు చెందిన స్పీచ్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో రీడ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు కోసం బోర్లు ఏర్పాటు చేశారు. స్పీచ్ సేవా సంస్థ ఛైర్మన్ కే శ్రీనివాసరావు సహకారంతో మూడు బోర్లు ఏర్పా టు చేసినట్లు రీడ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు ఆరుముళ్ల మురళీ తెలిపారు.

ఉపాధ్యాయుడు నరేంద్రకు అవార్డు

నెల్లూరు (విద్య) : నార్త్‌రాజుపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మక్తాల నరేంద్ర ఏపీ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఏలూరులో జరిగిన సాహిత్య సంబరాల్లో నిర్వహించిన కవి సమ్మేళనంలో కవితాగానం చేసినందుకు ఆయనకు అవార్డు దక్కింది. సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రసాద్, ప్రముఖ కవి బోయిభీమన్న సతీమణి బోయి హైమావతి తదితరులు నరేంద్రను సత్కరించి ప్రసంశా పత్రాలను అందచేశారు. అలాగే, నెల్లూరు నగరానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి గుండాల నరేంద్రకు విశిష్ట సేవా పురస్కారం లభించింది. ఆయనకు అవార్డు, రూ.5వేల నగదు అందచేశారు.

ఒడ్డె ఓబన్న జయంతి

నెల్లూరు(హరనాథపురం) : వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఒడ్డె ఓబన్న 217 జయంతిని ఓ ప్రైవేటు భవంతిలో నిర్వహించారు. సంఘం ఆర్గనైజింగ్ కార్య దర్శి గుంజి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఉప్పు భాస్కర్ మాట్లాడు తూ స్వాతంత్ర్య సమర యోధుడు ఓబన్న ఆంగ్లేయుల సైన్యాన్ని గడగడలాడించారన్నారు. ఆయనకు ఘనంగా నివాళుల ర్పించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : కాకాణి

వెంకటాచలం, జనవరి 11 : సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రామాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామదాసు కండ్రిగ, నాయుడుపాళెం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సిమెంట్ రోడ్లను, సైడ్ డ్రైన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ ముజీబున్నిసా, ఎంఈవో మధుసూదన్, హౌసింగ్ ఏఈ గౌస్ మొహిద్దీన్, ఏపీవో సురేంద్ర, సచివాలయాల మండల కన్వీనర్ మందల వెంకటశేషయ్య, సర్పంచ్ నాజునీ, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, నాయకులు షేక్ షాజహాన్, చాట్ల వెంకటసుబ్బయ్య, వేమారెడ్డి రఘునందన్ రెడ్డి, మోహన్‌నాయుడు తదితరులున్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధిపై సమీక్ష



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

సైదాపురం, జనవరి 11: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పీహెచ్‌సీ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు పీహెచ్‌సీ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల న్నారు. పీహెచ్‌సీ అభివృద్ధిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమం లో డాక్టర్ జనార్థన్, సిబ్బంది పాల్గొన్నారు.

గంధం రమేష్ అంత్యక్రియల్లో సోమిరెడ్డి



పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సోమిరెడ్డి

పొదలకూరు, జనవరి 11 : మండలంలోని మరుపూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు గంధం రమేష్ అంత్యక్రియల్లో గురువారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, బక్కయ్యనాయుడు, జమీర్, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, పిస్నెల ప్రభాకర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపునకు పాల్పడుతున్న వైసీపీ

కొడవలూరు జనవరి 11: టీడీపీ చేరుతున్న నాయకులపై వైసీపీ నేత లు అక్రమ కేసులు పెట్టి, కక్షసాధింపు చర్య లకు పాల్పడుతున్న దని టీడీపీ మండల అధ్యక్షుడు కోటం రెడ్డి అమరేంద్రరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని నార్తురాసుపాలెం పీఎస్ఆర్ కల్యాణ మండపంలో గురువారం కోవూరు నియోజకవర్గ టీడీపీ సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు రైతులు పంటల సాగుకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాక యూరియా కొరతతో అల్లాడిపోతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్ అరాచకపు పాలనకు చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు చెక్కామదన్, కేతూ వెంకట రమణారెడ్డి, జీవీఎన్ శేఖర్ రెడ్డి , ఎంవీ శేషయ్య , వీరేంద్ర చౌదరి,హరికృష్ణ పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో మసీదు తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

విడవలూరు, జనవరి 11: మండల పరిధిలోని పార్లపల్లి లో పీడబ్ల్యూడీ స్థలాన్ని అక్రమించుకుని నిర్మించిన మసీదును వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మసీదును బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి రేకుల షెడ్డు వేసి మైకులు పెట్టి అనధికారికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని మసీదుని ఏర్పాటు చేస్తే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం సరికాదన్నారు. మసీదుని సందర్శించిన ఓ ప్రజా ప్రతినిధి విరాళం కూడా ఇవ్వటం చోద్యంగా ఉందన్నారు. ఈ విషయమై జిల్లా అకారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముక్కు రాధాకృష్ణ, దాసరి ప్రసాద్‌గౌడ్, ఇండ్ల రాఘవేంద్ర, గ్రామ పెద్దలు కొనిదల చంద్రశేఖర్, నిమ్మల వశికుమార్, నట్రంబాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిహారం కోసం మత్స్యకారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ముత్తుకూరు, జనవరి 11 : ప్రతి నెలా తమ జీవనోపాధి కోసం అందజేస్తున్న పరిహారం ప్యాకేజీ ఇవ్వక పోవడంపై గురువారం మత్స్యకారులు ఆందోళన చేయడంతో నేలటూరుపాలెం సముద్ర తీరంలో ఉన్న ఏపీ జెన్‌కో విద్యుత్ కేంద్రం సీ వాటర్ ఇన్ టేక్ పంప్ హౌస్ వద్ద గురువారం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏపీ జెన్‌కో అక్టోబరు నుంచి తమకు జీవనభృతిగా ఇచ్చే ప్యాకేజీ ఇవ్వకపోతే ఎలా జీవించాలని మత్స్యకారులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ప్యాకేజీ వెంటనే ఇవ్వకపోతే పంప్ హౌస్‌ని ఆపివేస్తామని స్పష్టం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. శుక్రవారం ప్యాకేజీ పంపిణీ చేస్తామని జెన్‌కో అధికారులు హామీ ఇవ్వడంతో మత్స్యకారులు పంప్ హౌస్ నుంచి వెనుతిరిగారు.

పింఛన్ కోసం పడిగాపులు



ఎంపీడీవో కార్యాలయం ముందు నిరీక్షిస్తున్న కామాక్షమ్మ

బుచ్చిరెడ్డిపాళెం: కొన్నేళ్లుగా ఆగకుండా వస్తున్న పింఛన్ ఈనెలలో ఆగడంతో ఆ వితంతువు ఆందోళనకు గురైంది. జీవనాధారం ఆ పింఛనేనంటూ మండలంలోని జొన్నవాడకు చెందిన నాటకరాణి కామాక్షమ్మ కన్నీటి పర్యంతమైంది. మూడు రోజులుగా వలంటీరు, సంబంధిత సచివాలయ సిబ్బందితో ఆమె మొరపెట్టుకుంది. పింఛన్ వెరిఫికేషన్‌లో ఉందని, ఎంపీడీవో కార్యాలయం పరిధిలో ఆగి ఉందని చెప్పారని బాధిత మహిళ గురువారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించినా ఎంపీడీవో రాక పోవడంతో ఆమె వెనుదిరిగింది.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

విడవలూరు, జనవరి 11 : వీరారెడ్డిపాళెం గిరిజన కాలనీలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సర్పంచు రావిళ్ల మల్లికార్జునరావు, కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచు మల్లికార్జున, కోరమండల్ మార్కెటింగ్ అధికారి రాజారెడ్డిలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది శశికాంత్, వెంకయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

● **కోవూరు:** స్థానిక గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాల్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రంగవల్లుల పోటీలు, భోగిమంటలు, ఎడ్లబండ్ల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కళాశాల కార్యదర్శి సుధాకరరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

పొదలకూరు, జనవరి 11 : పట్టణంలోని దేవాంగవీధిలో శ్రీరామలింగ చాముండేశ్వరిదేవి దేవస్థానం ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మధిర కృష్ణవేణి, బట్ట లావణ్య, పడవల రేణుకలు దక్కించుకున్నారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్ ఆకులూరు అనురాధ, శివాలయం ట్రస్ట్ బోర్డు మెంబర్ వూకోటి భారతి, గ్రామ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు వూకోటి లక్ష్మీనారాయణ, అట్ల ప్రభాకర్‌రెడ్డి, హేమంత్ ఆకులూరు, దేవస్థానం నిర్వాహకులు మధిర శ్రీనివాసులు, చప్పరం రామకృష్ణయ్య, పముజుల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించండి : జనసేన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 11: నగరంలోని ప్రతి గడపకు జన సైనికులు వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నగరానికి చెందిన 54 డివిజన్ల ఇన్‌చార్జులు, నగర కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం 60 రోజుల్లోనే వైసీపీ ప్రభుత్వం అంతం కాబోతుందని, రాబోయేది జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రజా ప్రభుత్వమేనన్నారు.

రా.. కదలిరాతో వైసీపీలో వణుకు

● టీడీపీ నేత అబ్దుల్ అజీజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్

నెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నారా చంద్రబాబునాయుడు చేపట్టిన రా కదలిరా సభలకు వస్తున్న జనవాహినిని చూసి వైసీపీలో వణుకు మొదలైందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. గురువారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు సానుభూతితో జగన్మోహన్ రెడ్డికి ఒక్క అవకాశమిస్తే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని దుయ్యబట్టారు. కూల్చివేతలతో ప్రారంభమైన వైసీపీ పాలనను నమ్మి పరిశ్రమలు రావడం లేదన్నారు. మద్యపాన నిషేధమని మాటిచ్చి తప్పడమేగాక భవిష్యత్‌లో మద్యంపై వచ్చే ఆదాయాన్ని చూపి అప్పు తెచ్చిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని యువతను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. అన్నా క్యాంటీన్లను ఎత్తేసి పేదల కడుపుకొట్టిన వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా కాపాడగలరని అజీజ్ ప్రశ్నించారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని ఒక్క చంద్రబాబు మాత్రమే బాగుచేయగలరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగరాధ్యక్షుడు మామిడాల మధు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో లోపాలు రానివ్వొద్దు

● నగర కమిషనర్ వికాస్

నెల్లూరు(సిటీ), జనవరి 11 : భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం తుది ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి లోపాలు రానివ్వొద్దని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వతేదీ వరకు స్వీకరించిన ఫాం 6,7,8 దరఖాస్తులను క్షుణంగా పరిశీలించాకే తుది జాబితాలో స్థానం కల్పించాలని సూచించారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లు ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పక పాటించాలన్నారు.

కార్మిక సంఘంతో చర్చలు సఫలం

సమ్మె విరమించిన మున్సిపల్ కార్మికులు గురువారం కమిషనర్‌తో స్థానిక సమస్యలపై చర్చించారు. వారి డిమాండ్లపై కమిషనర్ సానుకూలంగా స్పందించడంతో నెల్లూరులో సమ్మెను పూర్తిగా విరమించినట్లు కార్మిక సంఘ నాయకులు ప్రకటించారు. సమ్మె కాలంలో కార్మికులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు కార్పొరేషన్ ద్వారా అందాల్సిన పలు ప్రయోజనాలు కార్మికులకు అందచేయాలని కోరారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), జనవరి 11 : నగరంలోని బట్వాడిపాళెం సెంటర్‌లో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర, భారత రాజ్యాంగం పుస్తకాలను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంద బాబ్జి ఉచితంగా పంపిణీ చేవారు. ఆ పుస్తకాల రచయిత గోడ రమణయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమన్నారు. బాబ్జి మాట్లాడుతూ నేటి యువత అంబేడ్కర్ పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

నవజాత శిశువు ఐసీడీఎస్‌కు అప్పగింత

నెల్లూరు (వైద్యం) జనవరి 11 : గుర్తు తెలియని నవజాత శిశువు ఆరోగ్యాన్ని మెరుగు పరిచి ఐసీడీఎస్‌కు అప్పగించినట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం కలిచేడు గ్రామ శివార్లలో చెరువు వద్ద ముళ్ల పొదలలో 1.90 కేజీల బరువు ఉన్న నవజాత శిశువును గత నెల 12వ తేదీన వదిలివెళ్లారన్నారు. ఆ చిన్నారిని 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తీసుకురావడంతో చిన్న పిల్లల విభాగం హెచ్‌వోడీ డాక్టర్ జయచంద్ర నాయుడు పర్యవేక్షణ లో ఎస్ఎన్‌సీయూ నోడల్ అధికారి డాక్టర్ శివరాయుడు సంరక్షణలో అన్ని రకాల వైద్య సేవలు అందించామని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఐసీడీఎస్‌కు ఈ నెల 9వ తేదీ శిశువును అప్పగించినట్లు పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లూరు (వైద్యం), జనవరి 11 : తెలుగుదేశం పార్టీ నేత వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, బాలాజీనగర్ గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వేమిరెడ్డి కుమారులు డాక్టర్ ప్రీతంరెడ్డి, డాక్టర్ సిద్దార్థ గీతామయి వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి సేవలను ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు ప్రశంసించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 11: పడుగుపాడు-నెల్లూరు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై నలుపు రంగు నైట్ ప్యాంటు, పచ్చరంగు డ్రాయరు ఉన్నాయని తెలిపారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్ఐ ఎన్ హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

నెల్లూరు (సాంస్కృతికం) : 6వ డివిజన్ ఎస్‌బీఎస్ కల్యాణ మండపం వద్ద మహిళలకు గురువారం రంగవల్లుల పోటీ నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ హాజరై బహుమతి ప్రదానం చేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు తులసి, కార్యదర్శి కొండా శిరీష, కోశాధికారి గంగిశెట్టి రాధా, మెంటా స్వర్ణమాల్య, కొండా ప్రవీణ్‌శంకర్, కోట సత్యనారాయణ, సోమిశెట్టి రమేష్‌బాబు పర్యవేక్షించారు.

జయభారత్ ఆసుపత్రికి రూ.10 లక్షల విరాళం



నెల్లూరు (వైద్యం), జనవరి 11 : నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి వీఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కొండ్లపూడి బలరామిరెడ్డి రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. గురువారం ఆసుపత్రి ఛైర్మన్ పొన్నవోలు సీతారామిరెడ్డికి ఈ విరాళాన్ని అందచేశారు. ఇలాంటి సంస్థలకు తాను ఎప్పుడూ చేయూతనందిస్తూనే ఉంటానని వెల్లడించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాత కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, ఆసుపత్రి వైస్ ఛైర్మన్ బాలు సుబ్బారావు, కోశాధికారి గుర్రం సుధాకర్, జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో నగరాభివృద్ధి శూన్యం

● మాజీ మంత్రి నారాయణ సతీమణి రమాదేవి



ప్రచారంలో పొంగూరు రమాదేవి

నెల్లూరు (వైద్యం) జనవరి 11 : గడిచిన నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో నెల్లూరు నగరంలో జరిగిన అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి విమర్శించారు. 16వ డివిజన్ చిల్డ్రన్స్ పార్కు, బాలాజీ నగర్ ప్రాంతాల్లో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. గతంలో మంత్రిగా నారాయణ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రాబోవు ఎన్నికల్లో నారాయణ ను ఆదరించాలని కోరారు. బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు రవి, టీడీపీ నాయకుడు, టీవీ నటుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు రమాదేవిని సత్కరించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బాలయ్య సైన్యం నేతలు తిరుమలశెట్టి సురేష్, గుండు సుబ్రహ్మణ్యం, రాజా రవీంద్ర, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం టీడీపీనే : కోటంరెడ్డి కుటుంబం

నెల్లూరు రూరల్, జనవరి 11 : రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రత్యామ్నాయం టీడీపీయేనని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రజలకు వివరించారు. బాబుష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం హౌసింగ్‌బోర్డు కాలనీలో వారు పర్యటించారు. ఎమ్మెల్యే సతీమణి కోటంరెడ్డి సుజిత, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పడి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు.

పార్టీ మారాల్సిన అవసరం లేదు : ఆదాల

నెల్లూరు(హరనాథపురం), జనవరి 11 : పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం 33వ డివిజన్ నేతాజీనగర్‌లో రూ.1.40 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో పోటీచేస్తున్నానని స్పష్టం చేశారు.

వ్యవసాయ కనెక్షన్లు వెంటనే మంజూరు చేయండి

● విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), జనవరి 11: జిల్లాలో వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ భవన్‌లోని అయన కార్యాలయం నుంచి అన్ని డివిజన్ల అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ సర్వీసులకు సంబంధించి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లని వారంలో మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కనెక్షన్ల జారీ ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ప్రతినెలా 7వతేదీలోగా బిల్ రీడింగ్ తీయాలని, జీఐఎస్ సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సీనియర్ అకౌంటెంట్ మురళి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

● ఏపీ విద్యుత్ మీటరు రీడర్లు

నెల్లూరు(జడ్పీ), జనవరి 11: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని రీడర్ల సంఘం నాయకులు హెచ్చరించారు. ఆ సంఘం సమావేశాన్ని నెల్లూరులోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి అంకయ్య మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రీడర్లకి న్యాయం చేస్తామని గత ఎన్నికలకు ముందు చెప్పిన జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఆ విషయాన్ని విస్మరించారని విమర్శించారు. రీడింగ్ తీసినందుకు సిటీలో రూ.3.61 పైసలు, రూరల్‌లో రూ.3.73 పైసలు ఇవ్వాలని సీఎండీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కాంట్రాక్టర్లు పాటించటంలేదని ఆరోపించారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. 20రోజులు తీయాల్సిన రీడింగ్‌ను 7రోజుల్లో తీయాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రీడర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హజరత్ వలీ, యునైటెడ్ విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీ కృష్ణ, ఏఐవైఎఫ్ కార్యదర్శి మున్నా తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు

నెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు గురువారం నగరంలో భారీగా నిర్వహించాయి. పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి రవిచంద్రకు శుభాకాంక్షలు తెలియజేశాయి. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, డాక్టర్ శ్రీపతిబాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. మామిడాల మధు, దొడ్డపనేని రాజానాయుడు, బొమ్మి సురేంద్ర, కొండూరు పాలిశెట్టి, నన్నేసాహెబ్, షైనుద్దీన్, కప్పిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు (వైద్యం): బీద రవిచంద్ర పుట్టిన రోజు సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది రక్తదానం చేశారు. టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్ ఆదేశాలతో వైద్య విభాగం జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ షేక్ సిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాబోయే టీడీపీ ప్రభుత్వంలో బీద మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని సిరాజ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు. డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంపీలు ధనలక్ష్మి, నారాయణరావు, శ్రీనివాసులు, పారామెడికల్ సిబ్బంది హుస్సేన్, భాను, నవీన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.





టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు, రక్తదానం చేస్తున్న వైద్యులు

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

● క్షతగాత్రుడు కోనసీమ జిల్లా వాసి

నెల్లూరు(క్రైం), జనవరి 11: నగరంలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున బైక్ అదుపు తప్పడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన ఎం నాగసుబ్రహ్మణ్యం బంధువులు తిరుపతిలో ఉన్నారు. ఈ నెల 10వ తేదీన పని నిమిత్తం ఆయన ఒంటరిగా బైక్‌పై తిరుపతికి బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున ఎన్‌టీఆర్ నగర్ సమీపంలో బైక్ అదుపుతప్ప డంతో ఆయన బైక్‌పైనుంచి కిందపడ్డారు. తలకు తీవ్రగాయమైంది. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది అపోలో వైద్యశాలకు తరలించారు. సుబ్రహ్మణ్యం వద్దనున్న బ్యాగ్‌లో రూ.6 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రమాదంపై బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. క్షతగాత్రుని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఆరుచోట్ల ఇంఛార్జులను మార్చింది. వైసీపీ గురువారం రాత్రి విడుదల చేసిన మూడో జాబితా మేరకు ఆరుగురు సిట్టింగులకు టికెట్లు గల్లంతైనా అందులో ముగ్గురికి పార్టీ అధిష్ఠానం ప్రత్యామ్నాయం చూపింది. తిరుపతి ఎంపీ గురుమూర్తి సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గానికి బదిలీ కాగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుపతి పార్లమెంటుకు బదిలీ అయ్యారు. చిత్తూరు సిట్టింగు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు రాజ్యసభ స్థానానికి బదిలీ అయ్యారు. ఈ ముగ్గురినీ మినహాయిస్తే గూడూరులో వరప్రసాదరావు, పూతలపట్టులో ఎంఎస్ బాబు, మదనపల్లెలో నవాజ్ బాషాలకు టికెట్లు గల్లంతయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆరుచోట్ల వైసీపీకి కొత్త ఇన్‌ఛార్జులొచ్చారు!

ఐదు స్థానాల్లో తప్పని అంతర్గత సంక్షోభం

తిరుపతి ఎంపీ, సత్యవేడు ఎమ్మెల్యే పరస్పర బదిలీ



గురుమూర్తి - ఆదిమూలం

తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సత్యవేడు ఇంఛార్జిగా బదిలీ అయ్యారు. రానున్న ఎన్నికల్లో తిరుపతి నుంచీ మళ్ళీ ఎంపీగా పోటీ చేయడానికే ఆయన మొగ్గు చూపుతున్నారు. పెద్దగా శ్రమ, ఖర్చు లేకుండా ఎంపీగా గెలిచే అవకాశముంటుందని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. దానికి తోడు సత్యవేడు టీడీపీకి కంచుకోట కావడం, అక్కడి నుంచీ గెలుపు కష్టసాధ్యమని గ్రహించడంతో ఎంపీ పదవి వైపే ఆయన మనసు లాగుతోందని సమాచారం. అయితే అధిష్ఠానం ఆదేశంతో అయిష్టంగానే సత్యవేడుకు వెళ్ళేందుకు అంగీకరించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అదే సమయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సైతం అక్కడే మళ్ళీ పోటీ చేయాలని ఉవ్విళ్ళూరుతున్నారు. కానీ నియోజవకర్గంలో వ్యతిరేకవర్గం బలంగా వుండి టికెట్‌కు అడ్డుపడడంతో బదిలీ తప్పలేదు. ఆయన కూడా అయిష్టంగా, అసంతృప్తిగా తిరుపతి పార్లమెంటు అభ్యర్థిత్వానికి ఒప్పుకున్నట్టు ఎమ్మెల్యే సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇష్టం లేని చోట్ల పోటీ ఈ ఇద్దరికీ చేదు అనుభవాన్నే మిగుల్చుతాయేమోనన్న భయాందోళన వారి సన్నిహిత వర్గాల్లో వ్యక్తమవుతుండడం గమనార్హం.

ముగ్గురు ఎమ్మెల్యేలకు టికెట్ల గల్లంతు



వరప్రసాదరావు - మేరిగ మురళీధర రావు



ఎంఎస్ బాబు - సునీల్‌కుమార్



నవాజ్‌బాషా - నిస్సార్ అహ్మద్

గూడూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావుకు టికెట్ గల్లంతైంది. ఆయన రిటైర్డు ఐఏఎస్ అధికారి కావడంతో రాజకీయాల్లో ప్రజలకు, కార్యకర్తలకు చేరువ కాకుండా ఓ గిరి గీసుకుని అందులోనే వుండిపోయారు. దీంతో సొంత వర్గమంటూ లేకుండా పోయింది. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర రావు సీఎం జగన్‌కు సన్నిహితుడైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మద్దతుతో ఇంఛార్జిగా నియమితులైనట్టు సమాచారం. నేదురుమల్లి, నల్లపురెడ్డి వర్గాలు ఇప్పటికీ గూడూరులో ఎంతోకొంతమేర ప్రభావం చూపుతున్నాయి. ఈ రెండు వర్గాల మద్దతు మురళీధరరావుకు లభించనుంది. కాకపోతే ఈ రెండు వర్గాల కంటే కూడా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి వర్గం ఇక్కడ బలంగావుంది. ఆ వర్గం మురళీని వ్యతిరేకిస్తోంది. అధిష్ఠానం అతడికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేర్నాటి వర్గం మిన్నకుండిపోయింది.ఎన్నికల్లో మురళీ విజయానికి ఈవర్గం పనిచేసే పరిస్థితి కనిపించడం లేదు. ఆ రకంగా చూస్తే వరప్రసాదరావును మార్చడం వల్ల వైసీపీకి ఇక్కడ నష్టమే తప్ప లబ్ధి కలిగే పరిస్థితి లేదనే చెప్పాలి. పూతలపట్టు విషయానికొస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు అధిష్ఠానం మొండిచేయి చూపింది. గత ఎన్నికల్లో వద్దనుకున్న డాక్టర్ ముత్తిరేవుల సునీల్‌కుమార్ ఇపుడు ముద్దయ్యారు. ఎంఎస్ బాబుకు నియోజకవర్గంలోని ప్రతి దళితవాడలోనూ సొంత వర్గం ఏర్పడింది. ఇపుడా వర్గం సునీల్‌కుమార్ గెలుపుకోసం పనిచేసే అవకాశాల్లేవు. దానికి తోడు ఎంఎస్ బాబు కోసం గట్టిగా పోరాడిన నలుగురైదుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకులు అధిష్ఠానం తీరుతో అసంతృప్తితో అలిగి దూరంగా వున్నట్టు సమాచారం. వీరు చేతులెత్తేస్తే పార్టీ మునిగిపోయినట్టేనన్న ప్రచారం జరుగుతోంది. అలాగే మదనపల్లెలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు అధిష్ఠానం రిక్త హస్తం చూపింది. ఆయన్ను కాదని అసలు రాజకీయాలతో సంబంధమే లేని నిషార్ అహ్మద్‌కు అవకాశమిచ్చింది. దీంతో నవాజ్ బాషా వర్గం ఎన్నికల్లో పనిచేసే వాతావరణం కనిపించడం లేదు. ఇదివరకూ ఇక్కడ మైనారిటీ ఓటర్లు మూకుమ్మడిగా వైసీపీకి మద్దతిచ్చారు. దానికి తోడు మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా టీడీపీలో చేరడంతో మైనారిటీ ఓటర్లలో గణనీయమైన చీలిక ఏర్పడే అవకాశాలేర్పడ్డాయి.

ఆరణికి రాజ్యసభ ఖరారైనా....



ఆరణి శ్రీనివాసులు - విజయానందరెడ్డి

చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కూడా టికెట్ గల్లంతైంది. అయితే ఆయనకు రానున్న రాజ్యసభ ఎన్నికల్లో అవకాశం కల్పించేందుకు అధిష్ఠానం నిర్ణయించిందని, ఇక ప్రకటించడమే మిగిలిందన్న ప్రచారం నడుస్తోంది. నిజానికి రాజ్యసభ అవకాశం కల్పించడం శ్రీనివాసులుకు పదోన్నతి కల్పించినట్టే. చిత్తూరులో పోటీ చేసినా గెలుస్తామో లేదో తెలియని స్థితిలో రాజ్యసభ సభ్యత్వం దక్కే అవకాశాలేర్పడడం ఆయనకు అదృష్టమనే చెప్పాలి. కాకపోతే ఎంపీగా ఎన్నికైనా కూడా చిత్తూరు సెగ్మెంట్‌లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం సహకరిస్తారా అన్నది అనుమానంగానే వుంది. దానికి తోడు శ్రీనివాసులును అసెంబ్లీ బరి నుంచీ తప్పించడం పట్ల చిత్తూరు నియోజకవర్గంలో గణనీయంగా వున్న బలిజ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తితో వుంది. దాదాపుగా ఆ సామాజికవర్గమంతా వైసీపీకి మద్దతివ్వరాదని అంతర్గతంగా సమావేశాలు పెట్టుకుని మరీ తీర్మానాలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక వైసీపీ ఇంఛార్జి విషయానికొస్తే ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యం ఆయన గెలుపుకు అవరోధం కానుంది. పీడీ యాక్టు కింద అరెస్టయి జైలులో గడిపి వచ్చిన నేపథ్యం విద్యావంతులపై ప్రభావం చూపే అవకాశముంది. అంతే కాకుండా వెన్నంటి వుండే అనుచరవర్గం పట్ల నియోజకవర్గ ప్రజల్లో దౌర్జన్యకర శక్తులనే ముద్ర పడింది. ఇవన్నీ పార్టీ విజయానికి ప్రతిబంధకం కానున్నాయనే ప్రచారం జరుగుతోంది.

పెరగనున్న అంతర్గత విభేదాలు

మొత్తం మీద అధికార పార్టీ గురువారం విడుదల చేసిన మూడవ జాబితాతో అంతర్గత సంక్షోభం నెలకొంది. సత్యవేడు, గూడూరు, చిత్తూరు, పూతలపట్టు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సిట్టింగులను పక్కనపెట్టి కొత్తవారిని ఇంఛార్జులుగా నియమించడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు, కుమ్ములాటలు మరింతగా పెరగనున్నాయి. సిట్టింగు ఎమ్మెల్యేలు, వారి వర్గాలు కొత్త వారి గెలుపుకోసం సహకరించే అవకాశాలు దాదాపుగా లేవనే చెప్పాలి. ఎన్నికలు సమీపించేకొద్దీ ఈ వర్గాల నడుమ అగాధం మరింతగా పెరిగి మరింత సంక్షోభానికి దారి తీసే ప్రమాదమూ లేకపోలేదు.

సూళ్ళూరుపేటలో కిలివేటికి లైన్ క్లియర్ !



తడ, జనవరి 11: సూళ్లూరుపేట సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు వచ్చే ఎన్నికల్లో టికెట్ విషయమై వైసీపీ అధిష్ఠానం లైన్ క్లియర్ చేసినట్టు సమాచారం. ఈ మేరకు గురువారం ఆయన నియోజకవర్గవ్యాప్తంగా అనుచరులతో కలసి తాడేపల్లి వెళ్ళి అధినేత జగన్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపినట్టు సమాచారం. అయితే పార్టీ అధికారికంగా దీనిపై ప్రకటన చేయలేదు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాలుగా వైసీపీ చీలిపోయి పోటాపోటీ కార్యకలాపాలు సాగించిన సంగతి తెలిసిందే. ఆయన వ్యతిరేక వర్గం పలు దఫాలు సీఎం జగన్‌ను కలసి కిలివేటికి మళ్ళీ టికెట్ ఇవ్వవద్దని కోరిన విషయం తెలియంది కాదు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఈ రెండు వర్గాలను సమన్వయ పరిచే సయంలోనూ కిలివేటి మాకొద్దంటూ ఆయన ఎదుటే నిరసన గళాన్ని వినిపించారు. ఇటీవల గూడూరులో విజయసాయిరెడ్డిని అడ్డుకున్న కిలివేటి వర్గం ఆయనకే టికెట్ ఇవ్వాలని నినాదాలు చేసింది.ఏడాదిగా సాగుతున్న ఈ పరిణామాలతో టికెట్ కొత్త వ్యక్తికి ఇస్తారన్న ప్రచారం జరిగింది. అయితే నియోజకవర్గంలోని కొందరు సీనియర్ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించి మళ్లీ కిలివేటికే టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం అంగీకరించినట్టు తెలిసింది. దీంతో అధినేతను కలిసి కృతజ్ఞతలు చెప్పేందుకు కిలివేటి తన అనుచరవర్గంతో కలసి గురువారం తాడేపల్లి వెళ్ళారు. అక్కడ సీఎంను కలిశారు. ఈ మేరకు అక్కడ నుంచీ ఎమ్మెల్యే అనుచరులు ఫొటోలు, సమాచారం సామాజిక మాధ్యమాలకు విడుదల చేయడంతో నియోజకవర్గంలో అవి వైరల్ అవుతున్నాయి. దానికి తోడు గురువారం రాత్రి పార్టీ విడుదల చేసిన మూడవ జాబితాలో గూడూరు, సత్యవేడు, పూతలపట్టు, తిరుపతి ఎంపీ తదితర నాలుగు ఎస్సీ రిజర్వుడు స్థానాలలో కొత్త వారిని ఇంఛార్జులుగా నియమించడం, అందులో సూళ్ళూరుపేట ప్రస్తావన లేకపోవడంతో దాదాపుగా కిలివేటికి లైన్ క్లియర్ అయినట్టుగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.



టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి కమిషనర్ లాగిన్ ద్వారా చేర్చిన దొంగ ఓట్లను తొలగించాలి

- ఓటరుకార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలి
- టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 11: తిరుపతి నగరపాలక సంస్థ మాజీ కమిషనర్ గిరీషా లాగిన్ ద్వారా చేర్చిన 30వేల దొంగ ఓట్లను తొలగించాలని, అలాగే ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అప్పటి కమిషనర్ గిరీషా లాగిన్ ద్వారా 30వేల దొంగ ఓట్లను స్థానిక ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి నేతృత్వంలో చేర్చారని ఆరోపించారు. వెంటనే ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి సారించి తొలగించాలని డిమాండ్ చేశారు. నిజమైన ఓటరు ఓటు వేయాలంటే ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని కోరారు. ప్రజల ఆస్తులకు అధికార వైసీపీ ఎసరు పెడుతోందని, అందుకోసమే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకువచ్చిందని ఆరోపించారు. వైసీపీ కుయుక్తులను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు మద్దతు తెలపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాభీష్టంతో ఎన్నికల్లో గెలవాలే కాని దొంగ ఓట్లను అడ్డుపెట్టుకుని నెగ్గాలనుకోవడం సరికాదని హితవు పలికారు. టీడీపీ నాయకులు సూరా సుధాకర రెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్‌యాదవ్, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, కంకణాల రజనీకాంత్‌నాయుడు, మునిశేఖర్ రాయల్, ఆముదాల తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందుకుంటున్న లబ్ధిదారులు

జగనన్నతోడు లబ్ధిదారులకు రూ.18.21కోట్లు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11 : జగనన్న తోడు పథకంలో భాగంగా చిరు వ్యాపారుల ఆర్థిక స్వావలంబన కోసం నాలుగో ఏడాది ఎనిమిదవ విడత కింద జిల్లాలోని 16,541మంది లబ్ధిదారులకు రూ.17.50కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు.గతంలో రుణాలు తీసుకున్న 30,782మంది చిరు వ్యాపారులకు సుమారు రూ.70.71లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ లభిస్తుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి లబ్ధిదారులకు రూ.18.21కోట్ల మెగా చెక్కును అందజేశారు.డీఆర్డీఏ, మెప్మా, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సామాన్యుడిని అందలమెక్కించిన ఘనత టీడీపీదే

- జయహో బీసీ సదస్సులో నెలవల, నరసింహ యాదవ్



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, జనవరి 11: సామాన్యులను సైతం రాజకీయంగా, ఆర్థికంగా అందలమెక్కించిన ఘనత టీడీపీదేనని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పెళ్లకూరు మండలంలోని కొత్తూరులో గురువారం జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీ రామారావు, ప్రస్తుత అధ్యక్షుడు చంద్రబాబు హయాంలోనే అనేక మంది సామాన్యులు రాజకీయంగా ఎదిగారని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దోచుకో.. దాచుకో... కూల్చేయ్.,, ఆక్రమించుకో... వంటి చర్యలకు పాల్పడుతూ 14లక్షల ఎకరాల భూములను ఆ పార్టీ నాయకులు కబ్జా చేశారన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందినవే అత్యధికంగా ఉన్నాయన్నారు.రాష్ట్రాన్ని రూ.12 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టడంతో ప్రతి కుటుంబంపై వైసీపీ రూ.అయిదు లక్షల అప్పు మిగిల్చిందన్నారు. ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేసి బీసీలను కోలుకోలేని విధంగా దెబ్బతీశారన్నారు.జగన్ మరోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల మనుగడ ప్రశ్నార్థకమేనని స్పష్టం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ బీసీలకు తెలుగుదేశం పార్టీలో దక్కే గౌరవం మరే ఇతర పార్టీల్లో దక్కదన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన బీద రవిచంద్రను గతంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో పాటు అచ్చెన్నాయుడిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.వైసీపీ అసమర్ధ అవినీతి పాలనతో ప్రజలు విసిగి వేసారిపోయిన నేపథ్యంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని చెప్పారు.నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఎమ్మెల్యేని కూడా తాడేపల్లి ప్యాలస్‌లో అడుగు పెట్టనివ్వని జగన్ నేడు ఓటమి భయంతో అందరినీ పిలిపించుకుని మాట్లాడుతున్నారని తెలిపారు. అయితే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కేటాయింపు విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను మాత్రం అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు.చెంబేడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు యర్రాబత్తిన మునీంద్ర ఈ సందర్భంగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు చేజర్ల మనోహరాచారి, వట్టకుండల శేఖర్‌నాయుడు, దామెర ప్రసాద నాయుడు, గోపాల్ రెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్ అభివృద్ధికి కృషి



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న అదనపు డీజీపీ అతుల్ సింగ్

వెంకటగిరిటౌన్, జనవరి 11: 9వ బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తామని ఏపీఎస్పీ అడిషనల్ డీజీపీ అతుల్ సింగ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక 9వ బెటాలియన్‌ను ఆయన సందర్శించారు. బెటాలియన్‌లోని క్యాంటీన్, టైలరింగ్ సెంటర్, గ్యాస్ ఆఫీస్, ప్రొవిజనల్ స్టోర్, ఆస్పత్రి, క్వార్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం దర్బార్ నిర్వహించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదోన్నతులు, బదిలీల విషయమై సిబ్బంది వినతిపత్రం అందించారు. బెటాలియన్ సిబ్బంది క్రమశిక్షణతో మెలుగుతున్నారని కమాండెంట్ ప్రకాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎల్ మనోహర్, ఆనంద్ కన్నా, ఏవో చంద్రమౌళి, డాక్టర్ శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయం



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు, జనవరి 11: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం గూడూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదని, ఉన్న పరిశ్రమలు కూడా వైసీపీ నాయకుల అవినీతిని తట్టుకోలేక పక్కరాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. యువత నిరుద్యోగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు ఇసుక, సిలికా, మైనింగ్‌తో లక్షల కోట్లు దోపిడీ చేశారన్నారు. భూహక్కు చట్టం అమలైతే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయం సాధించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నటశేఖర్, సునీల్, చందు, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమ్మె కొనసాగింపు



మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

వెంకటగిరి, జనవరి 11: తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు గురువారం విధుల్లోకి వచ్చారు. అయితే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్, వాటర్ వర్కర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు 9వ రోజు కూడా తమ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరు జాన్ మాట్లాడుతూ తాము సమ్మె చేస్తున్న శిబిరం వద్దకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యను తమకు బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లిస్తే సమ్మెను విరమిస్తామని చెప్పామన్నారు. ఆయన తమపై ఆగ్రహం వ్యక్తం చేయడం తగదన్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ, శ్రీనివాసులు, కందప్ప, శేఖర్, నరేష్, చక్రి, నాగేశ్వరావు, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రోటవర్ కాలనీలో ఇంటింటికీ టీడీపీ



మైక్రోటవర్ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 11: మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీలో గల మైక్రోటవర్ కాలనీలో గురువారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరిగింది. ఆ పార్టీ నాయకులు ఇంటింటా తిరిగి మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పాశం సునీల్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జలీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సుధీర్‌రెడ్డి, అనూక్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య నీళ్లు నిల్వలేకుండా చూడండి



పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

బాలాయపల్లి, జనవరి 11: బాలాయపల్లి గిరిజన కాలనీలో ఇళ్ల మధ్య నీళ్లు నిల్వ చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామం నుంచి బాలాయపల్లికి తాగునీటి పైప్‌లైన్ ఉంది. మధ్యలో గిరిజన కాలనీ వద్ద ఎయిర్ పైప్ పెట్టారు. అందులో నుంచి నిరంతరం నీళ్లు వస్తూనే ఉన్నాయి. అవన్నీ బాలాయపల్లి గిరిజన కాలనీ ఇళ్ల మధ్య నిల్వ చేరడంతో పరిసరాలు దుర్గంధం భరితంగా మారాయి. అలాగే దోమల ప్రభావంతో రాత్రిపూట స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని, మండల అధికారులు చొరవ తీసుకుని ఇళ్ల మధ్య నీళ్లు నిల్వలేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హిందూ, ముస్లిలు ఐక్యంగా ఉండాలి

గూడూరు, జనవరి 11: హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలని జైభారత్ సంస్థ జాతీయ కార్యదర్శి లోకనాథ్ అన్నారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో హిందూ, ముస్లింల ఐక్యతపై జైహో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతసామరస్యాన్ని కాపాడేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వీరయ్య, భాస్కర్‌గౌడ్, అన్వర్‌బాషా, మహేష్, నాగమణి, నాగరాజు, మహేష్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



చెంచయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

నాయుడుపేట టౌన్, జనవరి 11: విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని చిగురుపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.... చిగురుపాడు గ్రామానికి చెందిన చెంచయ్య(50) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం కూలి పని నిమిత్తం పంట పొలాల్లోకి వెళ్లాడు. ఓ రైతు పొలం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ నరసింహారావు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

కోట, జనవరి 11: మండల పరిధిలోని కర్లపూడిలో గురువారం కోడి పందేల స్థావరంపై ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ముగ్గురు జూదర్లను అదుపులోకి తీసుకొని రెండు కోడి పుంజులు, రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.





నాయుడుపేటలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద భిక్షాటన చేస్తూ అంగన్వాడీల నిరసన - సూళ్లూరుపేటలో పొర్లు దండాలు

హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వానికి అధోగతే

చిల్లకూరు, జనవరి 11: అంగన్వాడీలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వైసీపీ ప్రభుత్వానికి అధోగతి తప్పదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి అన్నారు. గురువారం గూడూరు గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యల కోసం అంగన్వాడీలు నెలరోజులకు పైగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా పట్టించుకోని సీఎం జగన్ ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం మంచి పద్ధతికాదన్నారు. వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, ఇంద్రావతి, ప్రభావతి, శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, గోపినాద్, శ్రీనివాసులు, ప్రసాద్, రమణయ్య, చంద్రయ్య, పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 31 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీలు గురువారం సీఐటీయూ నాయకులతో కలసి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, సంఘ నాయకులు కళావతి, నాగమ్మ, చెంగమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ప్రభుత్వం అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు ఇస్తే భయపడేదిలేదని సీఐటీయూ నాయకుడు పద్మనాభయ్య స్పష్టం చేశారు. అంగన్వాడీలు సమ్మెలో భాగంగా గురువారం స్థానిక హోలిక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారి పక్కన నిరసన తెలిపారు. వారికి సీఐటీయూ, యుటీఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పద్మనాభయ్య మాట్లాడుతూ అంగన్వాడీలు నెల రోజులుగా సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇచ్చి భయపెట్టాలని చూడడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను అంగీకరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అల్లెయ్య, లక్ష్మయ్య, సాంబశివయ్య, యుటీఎఫ్ నాయకులు ప్రభాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న రిలే దీక్ష గురువారం 31వ రోజు కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించే వరకు దీక్ష విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వరూపారాణి, మంజుల, సుభాషిణి, మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కోట: న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేద్దామని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న దీక్షకు యూటీఎఫ్ నాయకులు గురువారం సంఘీభావం తెలిపారు. యూనియన్ తరఫున అంగన్వాడీలకు రూ.15వేల చెక్కు అందజేశారు. అనంతరం సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను కలసి రూ.10వేలు అందజేశారు.

వైసీపీ అరాచకాలను వడ్డీతో సహా చెల్లిస్తాం: కురుగొండ్ల



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, జనవరి 11: వైసీపీ అరాచకాలను గుర్తుపెట్టుకొని టీడీపీ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. గురువారం ఆయన డక్కిలి మండలంలోని దేవునివెల్లంపల్లిలో ఇటీవల వైసీపీ నేతల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు ఏలశ్వరం శంకరయ్య, గౌరీలను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార మదంతో వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. అకారణంగా టీడీపీ నాయకులకు చెందిన ఆస్తులకు నష్టం కలిగిస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారని, అటువంటి వారందరికీ అధికారంలోకి తగిన సమాధానం చెప్తామని హెచ్చరించారు. ఇటీవల అక్రమ మైనింగ్‌పై దీక్ష చేపట్టిన మాజీ మంత్రి సోమిరెడ్డిని అడ్డు కొనేందుకు హిజ్రాలను పంపడం సిగ్గుచేటన్నారు. టీడీపీ పాలనలో హిజ్రాలను గౌరవించి వారికి పింఛను అందిస్తే వారిని వైసీపీ నేతల అరాచకాలకు పావుగా వాడుకోవడం దుర్మార్గమని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వం రైతుల సాగునీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంజూరు చేసిన ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడం అన్యాయమన్నారు. ఖనిజ సంపద సరిపోదన్నట్లు వైసీపీ నేతలు గంజాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలనే ఉపాధి అవకాశాలుగా ఎంచుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు దేవునివెల్లంపల్లిలో వైసీపీ మద్దతుతో ఎన్నికైన దేవునవెల్లంపల్లి పంచాయతీ ఉపసర్పంచు నరసయ్య మాజీ ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం డక్కిలిలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు దందవోలు రత్నాకర రెడ్డిని రామకృష్ణ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి పులికోల్లు రాజేశ్వరరావు, మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, ఆస్పత్రి సలహమండలి మాజీ చైర్మన్ చెలికం భాస్కరరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వైసీపీ నేతలు



ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకుంటున్న వైసీపీ నాయకులు

చిట్టమూరు, జనరరి 11: మడల పరిధిలోని మెట్టు స్వర్ణముఖి నది వద్ద గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఇసుక రవాణాకు ఈ నెల 9వ తేదీతో అనుమతి ముగిసిపోయినా అక్రమంగా తరలిస్తుండడంతో వైసీపీ నాయకులు, రైతులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా తరలిస్తారని నిలదీశారు. తమకు అనుమతి ఉందంటూ ఇసుకాసురులు బుకాయించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. నదిలో నుంచి రహదారి వైపు దారులకు అడ్డంగా వైసీపీ నాయకులు గాడి తీయించారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

కోట, జనవరి 11: మండల పరిధిలోని గూడలిలో గురువారం రాత్రి అయోధ్య రామచంద్రుడి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అర్చక సలహా మండలి సభ్యుడు దివి అనంతబాబు, సమరసత సేవాసంస్థ జిల్లా కన్వీనర్ కొండూరు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్వామివారి అనుగ్రహం పొందడానికి బాలరాముడికి అర్చన చేసిన అక్షింతలను ప్రతి ఇంటికీ చేరాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కోన సాయిబాబా, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్టేడులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

కోట, జనవరి 11: మండల పరిధిలోని చిట్టేడు, ఊనుగుంటపాళెం గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పారిచర్ల భైరప్ప, మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు ఆధ్వర్యంలో పలువురు అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవానీ, ఏపీఎం రత్నయ్య, పంచాయతీ కార్యదర్శులు సుమలత, రాఘవరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణను వేగవంతం చేయండి

కోట, జనవరి 11: విధి నిర్వహణను వేగవంతం చేసి ఆదర్శంగా నిలవాలని మండల ఎంఈవోలు శైలజ, మస్తానయ్య కోరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు సమ్మె విరమణ తరువాత సమీక్షించారు. ప్రధానంగా క్లస్టర్ మొబైల్ టీచర్స్‌కు విధుల నిర్వహణ, విద్యాబోధన తదితర అంశాలపై ఎంఈవోలు అవగాహన కల్పించారు.



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచు సీఆర్ రాజన్ జన్మదినం సందర్భంగా గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాయి రాయల్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయండి

గూడూరు, జనవరి 11: విజయవాడలో ఈనెల 19వ తేదీన జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు నియోజకవర్గంలోని ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గురువారం స్థానిక సొసైటీకాలనీలోని ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులకు ఆరాధ్య దైవమైన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ విజయవాడలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో మన్నెం శీనయ్య, నరసయ్య, సతీష్‌రెడ్డి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



కళాశాలకు కుర్చీలు అందజేస్తున్న ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రసాద్

నాయుడుపేట, జనవరి 11: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. గురువారం పెనల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ వ్యాపార రంగంలోనే కాకుండా సామాజిక సేవల్లోనూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురవయ్య, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఆశీష్‌కుమార్, సిబ్బంది హేమంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, శంకర్, వంశీ, కృష్ణారెడ్డి, మునికుమార్, తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డులో గడపగడపకు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 11: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. కార్యక్రమంలో రాజా కుటుంబీకులు సర్వజ్ఞయాచేంద్ర, కౌన్సిలర్లు కాసా కృష్ణమూర్తి, వహీదా, ఆరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

చిల్లకూరు, జనవరి 11: సంక్రాంతి పండుగల నేపథ్యంలో గూడూరు పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ పారిశుధ్య కార్మికులకు సూచించారు. కార్మికులు సమ్మె విరమించుకుని విధుల్లో చేరడంతో గురువారం పట్టణంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను దేవసేనమ్మ పరిశీలించి సిబ్బంది సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయి

వెంకటగిరి, జనవరి 11: ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనతో విసిగి వేసారిన ప్రజలు ఆయన్ను ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని, చంద్రబాబు నిర్వహిస్తున్న రా.. కదలిరా.. సభలకు వస్తున్న జనమే ఇందుకు నిదర్శనమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సబబుకాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు జగన్ చేసే ప్రయత్నాలు సఫలం కావని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వెంకటగిరి నుంచి తాను అత్యధిక మెజారిటీతో గెలుస్తానని దీమా వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవి చెంద్ర జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, తాండవ చంద్రారెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, మల్లారం బాబు, గల్లా శ్రీనివాసులు, సుధ, రవి, గంగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు

450 మంది అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

కోట, జనవరి 11: కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 225 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 450 మంది వర్కర్లు, హెల్పర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సీడీపీవో మునికుమారి గురువారం తెలిపారు. ఎస్మా ప్రయోగించినందు వల్ల వెంటనే విధులకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు సీడీపీవో తెలిపారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోండి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న కందల కృష్ణారెడ్డి

నాయుడుపేట టౌన్, జనవరి 11: పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అధికారులు తక్షణమే అడ్డుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ పాత బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టారని, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతూభయబ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌కు ఎన్ని పర్యాయాలు వినతిపత్రం అందజేసినా అక్రమ కట్టడాలను అడ్డుకోవాడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను అడ్డుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సులేమాన్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న ఎంపీడీవో రజనీకాంత్

ఓజిలి, జనవరి 11: ఓజిలి మండలం పెద్దపరియలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో రజనీకాంత్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు సిలెండర్‌తో పాటు స్టౌ అందజేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ముమ్మడి సుబ్బారావు, బీజేపీ మండల కన్వీనరు ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలు జీవన విధానంలో భాగం కావాలి

వెంకటగిరి టౌన్, జనవరి 11: మానవుడి జీవన విధానంలో క్రీడలు భాగం కావాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం... ఆంధ్ర మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, పీఈటీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు